రాగ—భానుమతీ! వినుము. నా కావిషయములో నెంత మాత్రమును సందేహములేదు. కాని మనమాలోచించిన యుపాయమును వెంటనే ప్రయోగింపవలెను. నీగదిలో నేను చేయవలసినది సర్వమును సిద్ధము చేసినాను; ఇఁక ముందు జరగవలసినదానికి మనము మనభాగ్యదేవతను నమ్ముకొని యుండవలెను.

భాను—తాను నిర్ణయించినవానిని వివాహమాడుటకు నే నంగీకరించువఱకును నాముఖము చూడనని నాతండ్రి ప్రతిజ్ఞ చేసినాఁడు.

రాగ—ఈవిషయమే యతఁడు తనమిత్రుఁ డయినజయపాలునితో మాటాడుచుండఁగా నేనును పొంచుండి విన్నాను.—"నా కూఁతురు వసుకాముని పెండ్లియాడుట కొప్పుకొనునో లేదో రేపు గట్టిగా కడసారి యడిగి చూచెదను; భానుమతి యొప్పుకొనుట కనుమానించినయెడల, నాకూఁతుకు నాకు మరల విధేయురాలయి నా యాజ్ఞ శిరసావహించువఱకును నేను దానిని కన్నెత్తిచూడను; దానితో నోరు తెఱచి మాటాడను."—అని నీతండ్రి చెప్పినాఁడు.

భాను—అతఁ డన్నమాట తిరుగక యెప్పుడును పట్టినపట్టు విడువని కఠినస్వభావుఁడని యెఱిఁగియే నేను తప్పించుకొనిపోవుటకయి నీవీయుక్తి పన్నినావుగదా. ఈకృషిలో మనపరిచారిక మన కనుకూలురాలుగా నుండునట్లు పదిలపఱిచినావా?

రాగ—అది యీమంత్రములో మొదటినుండియు నాతో చేరియే యున్నది. నీప్రయత్నము సఫలమయిన పక్షమున, వసుకాముని విషయములో నీకున్న స్వాతంత్ర్యమును బాధ్యతయు సర్వమును నాకు విడిచిపెట్టెద నని నీవు వెనుక చేసినవాగ్దానమును మఱవక చెల్లింపవలయును జుమా.

భాను—నేనది సంతోషపూర్వకముగా చెల్లించెదను. సాధ్యమయినయెడల నీవాతనిని దక్కించుకొమ్ము. మీరుభయులును చిరసుఖ మనుభవింపవలయుననికోరి నిరంతరమును పరమేశ్వరుని ప్రార్థించెదను. అతఁడు నాప్రియుఁడయిన కామపాలునికంటెను పదిరెట్లు ధనమెక్కువగలవాఁడు సుమా.

పంచచామరము.
ధనంబు గల్గుదాననంచుఁ దారు నన్నునెంచినన్,
జనుల్ తలంపఁబోరు నిన్నుఁ జానరో! ధనాఢ్యఁగన్;
పెనంగొనున్మదంబు నీవు పెదదానవౌటకున్,
ఘనంబుగా ధనంబు నియ్యఁగల్గు దేనుగావునన్.

పంచచామరము.
వెలందిమిన్న! నీకు నాదువిత్తమెల్ల నిచ్చినన్,
జెలంగి నాదువల్లభుండు చిత్తమం దెఱింగెడున్
గొలందిలేని యట్టివస్తుకోటియున్ ధనంబునున్
దలంపఁ దన్న కోరియున్నదాన నంచుఁబిమ్మటన్.

పంచచామరము.
వరుండు నాదుచెట్టఁబట్టు భాగ్య మింత యుబ్బినన్
స్మరింపఁగల్మి లేకయుంట స్వప్నమందు నేనియున్;
కరంబు తన్నకోరికొంటిఁగాని యన్యమేదియున్
వరింపలేదటంచు నప్డువల్లభుండు నమ్మెడున్.

రాగ—భానుమతీ! నీతండ్రి వచ్చుచున్నాఁడు. కామపాలుని యొద్దనుండి నేను కట్టకడపట తెచ్చిన యుత్తరము వేగిరము నాచేతి కిమ్ము. నన్ను మీయింటినుండి పంపివేయుట కాజాబే కారణము కాఁబోవునుజుమా. నీకీవఱ కియ్యనట్టుగా దీనికి లక్కముద్ర వేసి తెచ్చి నేనిది యిక్కడ జాఱవిడిచెదను. (అని నిష్క్రమించుచున్నది).

[సుదర్శనవర్మయు, విజయవర్మయు ప్రవేశించుచున్నారు.]

సుద—ఓయీ! నీవుకూడ రాత్రులయందు వీథులలో బయలు దేఱి ప్రియురాండ్రనిమిత్తమయి పాటలు పాడుచున్నట్టున్నావే! పాపము! నీపనికిమాలినయీలలతోను కామగీతములతోను,నీవెక్కడ చుట్టుపట్లవారికి నిద్రపట్టకుండఁ జేయుచున్నావు? నీనడతవల్ల నీవు నీచెల్లెలికిఁగూడ మంచిమార్గమునే యుపదేశించుచున్నావు. ఓసీ! అమ్మాయీ! నీకొక్కసంగతి చెప్పవచ్చినాను. ఇఁక రాత్రులయందు మీకామవికారములును మీమాటలును పాటలును నేను సాగనియ్యను; మీపాటలును పద్యములును విన్నవారికెల్లను మతి పోవుచున్నది. అయినను నీవెఱ్ఱిచేష్టలు రేటిటితో కట్టుపడిపోవునులే. ఇఁక కొంచెముసేపటికి వసుకాముఁ డిక్కడకు వచ్చును. రేపటిదినము నీ వాతనిని వివాహము చేసుకోవలెను.

భాను—నాబొందిలో ప్రాణ ముండఁగా నేనాతనిని పెండ్లి చేసికోను.

విజ—నాన్నగారూ! అటువంటివానిని అల్లునిగా కోరి తెచ్చుటకు మీకెట్లు బుద్ధి పుట్టినది?

సుద—పిలువనిపేరంటముగావచ్చి నీయంతటనీవే మాకుహిత బోధచేయ కరుణించుచున్నావుగనుక, నాయందు దయచేసి నీకతని యం దేమిలోపము కనఁబడినదో చెప్పు.

విజ—మొదటమాట అతఁడు విదేశస్థుఁడు.

సుద—ఆసందేహముతో పనిలేదు. అతఁడు స్వదేశమువిడిచి తండ్రినాటినుండియు ఇక్కడనే యుండుటచేత ఈ దేశస్థుఁడే యయినాఁడు.

విజ—అతనిది శివమతము.

సుధ—ఇది మఱియొక తెలియనిమాట. అతఁడీరెండుమార్గములనుండియు విష్ణుమతస్థుఁడయినాఁడు.

విజ—అవునవును. అతఁడు ధనమునిమిత్తము పూర్వులనుండియు వచ్చుచున్నస్వమతమును వదలిపెట్టినాఁడు. ఈక్రొత్తమతమును మార్చుకొనుట కింకను ఆవశ్యకము రాలేదు కాఁబోలును!

భాను—అతఁడిప్పుడేమతములోను లేక దేవాలయమునకును మసీదునకును మధ్య నూఁగులాడుచున్నాఁడు.

సుధ—ఇదికాక మఱి యేమైనానున్నదా?

విజ—మఱి యేమియు లేదుగాని, అతఁడు మోసములయందును జిత్తులయందును విచిత్రమైన యాసక్తికల్గవాఁడఁట.

భాను—లోకములో మోసగాండ్రే తెలివితక్కువవారిని మాయచేసి లాభము పొందుచున్నను, అతఁడుమాత్రము సాధారణముగా తనజిత్తులచేత తానే మోసపోవుచుండుననీ వినుచున్నాను.

విజ—అది సత్యము. నేర్పుచాలని విలుకానివలెనే యితఁడెప్పుడును పెట్టిన గుఱి తప్పిపోయినను, తనచేతికి మాత్రము నారిదెబ్బ తగిలించుకొనుచుండును.

సుధ—ఇంతటితో సరిపోయినదా?

భాను—వీని నన్నిటిని మించినది యితనివద్ద భర్తయగుటకు పనికిరాని ప్రధానమైన లోప మింకొకటి యున్నది. అది వివాహమాడవలసినదాననైన నామనస్సునకు సరిపడినవాఁడు కాకపోవుట.

సుధ—నీ కతఁడు మనసు రాకపోయినను నీవాతని మనస్సునకు నచ్చినదానవు. వధూవరులలో నెవ్వరో యొకరనురాగముకలవారయి యుండుట చాలును. పెండ్లికిద్దఱునుపరస్పరానురాగము గలవారెప్పుడును దొరకరు. నీవెంత వెగటుగానున్నను, అతఁడు

మాత్రము తియ్యని స్వభావముగలవాఁడు. పుల్లచెట్టును తియ్యచెట్టు మీఁద నంటు కట్టినట్టుగా నిన్నటువంటివాని కంటఁగట్టినంగాని సత్ఫలము కలుఁగదు.

భాను—మొదల నతఁడు నన్ను కామించుననుటచేత నేనాతల కంటగించుచున్నది; అందుమీఁద నా కతఁడు భర్తయగునన్న పదిరెట్లధికముగా నాతల నొచ్చుచున్నది.

సుద—అది యంతయు నాకు తెలియదు. వివాహ మయిన తరువాత సామాన్యముగా సమస్తమును మాఱిపోవును. ఇప్పుడు నీతో నాకు వాగ్వాద మెందుకు? నేను చెప్పినట్టు విని నీ వాతనిని వివాహము చేసికొనెదవా? చేసికోవా?

భాను—ఈవిషయములో తప్ప మఱి యేవిషయములోను నేను మీయాజ్ఞ మీఱను.

సుద—నీవు నీతండ్రి సుఖమును చూడవా?

భాను—కావలసినంత చూచెదను. జనిత్రైకపుత్రికను యావజ్జీవము సుఖహీనురాలినిగాఁ జేయు దుఃఖ మాతనికి కలుగనియ్యను.

సుద—అమ్మాయీ! మేలుమేలు! నీబుద్ధికిసంతోషించినాను. ఇటుచూడు. నీవు బుద్ధి తెచ్చుకొని నాయాజ్ఞకు లోఁబడువఱకును నే నిఁక మొగము చూచి యెప్పుడును నీతో మాటాడను—ఏమి! బదులు చెప్పవేమి?—ఈచావడియు గదియు దాఁటి నిన్నివలకు రానియ్యను. నీవింటిలోనే రాత్రింబగళ్లు పడియుండవలెను. నేను వెలుపలకు పోవలసివచ్చినప్పుడు నిన్ను గదిలో పెట్టి తాళము వేసికొని కాని యిల్లుకదలను. నేనింట నున్నప్పు డెవ్వరునీయొద్దకుపోవలసినను నాపడకగదిలోనుండి పోవలసినట్లు చేసెదను. ఇఁక మన యిద్దఱిలో నెవరు గెలుతురో చూతము. ఏమి! మాటాడవేమి! నీవునాయెదుట

నుండి లేచి పో. పుత్రికాధర్మమును నీవు తెలిసికొని యుక్తముగా ప్రవర్తించు నంతవఱకును వెలుపలనుండు.

(అని వెలుపలకుతోసి వేయుచున్నాఁడు)

విజ—నాన్నగారూ! ఇటువంటివిషయములో తప్పక మీరు నా చెల్లెలియిష్టముకూడ కొంచెమాలోచించవలెను. అదిగాక శాము పాలుఁడు నామిత్రుఁడైన సంగతికూడ మీరుకొంతవిచారించవలెను.

సుద—అతఁడు నీకు మిత్రుఁడగుట యొక గొప్పయోగ్యత! అందుచేత నే నతనిని తప్పక గౌరవింపవలసినదే!

విజ—బావమఱఁదియగుటకు నామనస్సుకునచ్చినవాఁడతఁడొక్కఁడుతప్ప మఱియెవ్వరు నాకంటికగపడరు.

సుద—అగపడరు. అదినిశ్చయమే. నాకు కూఁతురుకాని చెల్లెలు నీకెప్పుడైన నుండ తటస్థించినయెడల, ఆతనితో వియ్యమందుటకు నేను నీకప్పు డడ్డమురాను. ప్రస్తుతముమాత్రము దయచేసి యిఁక నీ ప్రసంగము కట్టిపెట్టు.

విజ—సరేకాని నాచెల్లెలియెడలఁగల గౌరవముచేత నే నొక్కమాటమాత్రము చెప్పెదను.

సుద—చాలును. నీతండ్రియెడలఁగల గౌరవముచేత నీవా మాటను నీ మనసులోనే యుంచుకొని యిప్పుడు నోరుమూసుకొమ్ము.

విజ—ఇఁక నేను చెప్పవలసినదయిపోయినది. ఇప్పుడెవరివిషయములో మీ రింత క్రూరముగానున్నారో యాభానుమతియొక్క తల్లివిషయములో మీ కప్పుడున్న ప్రేమకు మీతండ్రి యడ్డమువచ్చినయెడల మాయీడున మీ కెట్లుండియుండునో మాత్రము స్మరణకు తెచ్చుకొండి.

సుద—అబ్బాయీ! మంచిమాట చెప్పినావు. నేను నిజము

చెప్పెదను విను. వయఃకాలములో నాకొక్క సీతల్లిధనముమీఁదనే యెంతో మక్కువయుండినది. అంతకంటె మఱియేమియు లేదు. ధనమునిమిత్తము నేనామెను వివాహమాడినాను; తనతండ్రియాజ్ఞ ననుసరించి నన్నామె వివాహమాడినది. అంతకంటె మఱియేమియు లేదు. అయినను మాది అనుకూలదాంపత్యమయినందుకు లేశమును సందేహములేదు. వివాహమునకు పూర్వము మేమొకరినుండి యొకరము విశేషానురాగము నపేక్షించి యెఱుఁగము గనుక, మా కాశాభంగ మెప్పుడును కలుగలేదు. మాలోమా కెప్పుడైన కొంచెము వివాదము సంభవించినను, మాయిద్దఱిలో నెవ్వరము కలహప్రియులముకానందున మరల మేమప్పుడే సమాధానపడుచువచ్చెడి వారము. ఆదొడ్డయిల్లాలికి మరణ మాసన్నమయినప్పుడు—ఆమె యెల్లకాలమును జీవించుగాకయని దైవమును ప్రార్థించితిని. ఈయుజ్జయినీనగరములోని కళత్రవిహీను లందఱును తమభార్యలవిషయమయి యిట్లు ప్రశంసింపగలుగుదురుగాక! ఇప్పుడు నేను లోపలికిపోయి యాగది తాళము పట్టుకొనివచ్చెదను. ఇంతలో తండ్రియాజ్ఞ మీఱుమని నీవేదైన నీ చెల్లెలి కుపదేశము చేయవలసియున్నయెడల, నీయుపన్యాసమును మిక్కిలి సంగ్రహపఱుపవలెను. కాలము వ్యర్థపుచ్చక నీపనిచూచుకో. విన్నావా; (అని నిష్క్రమించుచున్నాఁడు.)

విజ—నామిత్రుఁడయినకామపాలుఁడిఁక నిరాశచేసుకోవలసినదే; అయినను భానుమతిమాత్రము చలింపక దృఢముగా నున్నది. నాతండ్రికోపమువలన ప్రియునిమీఁద దాని కనురాగము మఱింత యెక్కువే కావచ్చును. ప్రపంచములో సాధారణముగా ననుద్దేశపూర్వకముగానైనను మనమనోవేదనకు హేతుభూతులయిన పక్షమున, మనక్షేమము కోరినవారియెడలసహితము మనకు ద్వేషము

కలుగుట సహజము. తమమనఃప్రియులయి యున్నవారినిమిత్తమయి తాము శ్రమపడవలసివచ్చినను స్త్రీలెప్పుడును వారియెడల నధికానురాగమును గనఁబఱుపరు. (లోపల సందడి) ఓహోహో! ఆగడబిడ యేమి? మాతండ్రిగారికిని రాగమంజరికిని నేదో దొమ్ములాట పొసఁగినది. ఇఁక నేనిక్కడ నిలువఁగూడను. పోయెదను.

(అని నిష్క్రమించుచున్నాఁడు)

[చేత జాబొకటి పట్టుకొని, రాగమంజరిని లాగుచు
సుదర్శనవర్మ ప్రవేశించుచున్నాఁడు]

సుద—నా కద్భుతముగా నున్నది! నా కాశ్చర్యముగా నున్నది! ఏమి యీద్రోహము! ఏమి యీమోసము! ఓ కామపాలుని తొత్తా! వెఱ్ఱిబొమ్మ నుంచినట్లు నిన్నిక్కడ నుంచినందుకు నా కొమార్తెను లేవఁదీయుటకే దుస్తంత్రము నడుపుచున్నావా?

రాగ—ఇప్పుడు న న్నేమన్నారూ!

సుద—వెఱ్ఱిబొమ్మ వన్నాను. తెలివిమాలిన వయసువారినివలలోఁ బడఁద్రోచెడి పరమవంచకురాలా రా! నీవుదీని కేమిచెప్పెదవో చెప్పు.

రాగ—మీరీయుత్తరము నాచేతినుండి పెనఁగులాడి పుచ్చుకొని నాగుట్టు తెలిసికొన్నారు గనుక, నేనిప్పుడేదియు లేదనను. మీరన్నట్లు నేను కామపాలుని కనుకూలురాలనే. వివేకము లేక కఠినచిత్తులై యుండు ముసలితలిదండ్రులకెల్లను బుద్ధివచ్చునట్లుగా వారియెడల తిరస్కారము చూపెడు లోకములోని పడుచుపుత్రికలవలెనే మీకొమార్తెయు మీయెడలను నడుచుకోవలె ననియే నాకోరిక. ఆమె సుకుమారమైన యనురాగమునకు నా కానంద మగుచున్నది. ఆయనురాగపోషణమునకయి నాచేతనయిన సాయము చేయుటయే నా యభిమతము.

సుద—ఆఁ! సుకుమారమైన యనురాగమా! మిమ్ము శిలల వలె నింతకఠిన మతులనుచేసినది యీసుకుమారానురాగమే. మోసములకు పుట్టినిల్లవైన ఓముసలితొత్తా! నాకోమార్తె సౌందర్యమునకు రక్షకురాలవుగా నుండుటకు నిన్ను కావలి యుంచినాను. పెద్దపులివంటి నిన్నుచూచి చెంతచేరక శృంగారనాయకులు బెదరి పాఱిపోవుదురని నేను నమ్మినాను. పరులకు భీతిఁగొల్పెడు క్రూరలక్షణములన్నియు నీముఖముమీఁదనే యిప్పుడును వ్రాసియున్నట్లు కనఁబడుచున్నవి. ఓసి కృతఘ్నురాలా! తక్షణము నీవు మాయిల్లువిడిచిపెట్టిపో. ఇది నిస్సందేహముగ సుకుమారానురాగమే. పోపో! ఓతుంటరికుంటెనకత్తెకానా! పో.

రాగ—ఓయి తిట్టఁబోతు ముసలి — నీపే రుచ్చరించి నానోరు చెఱుపుకోను. ఓకిరాతుఁడా! చెఱసాలనుబోలిన నీయిల్లిప్పుడు విడిచిపోయెదను. నాబట్టలైనను నన్ను తెచ్చుకోనిచ్చెదవా? లేదా? నావస్తువులు నేను తీసికొని పోవచ్చునా?

సుద—మాయింటికి వచ్చినప్పుడు నీవు కట్టుచీరతో వచ్చినావు. ఇంతలో నీవే వస్తువులు దొంగిలించినావు?

రాగ—నాయజమానురాలివద్ద నేను సెలవుపుచ్చుకొనికూడ రావలెను. నావస్తువు లామెవద్ద నున్నవి. నామేలిముసుఁగుకూడ ఆమె గదిలోనే యున్నది.

సుద—నీయందమునకు మేలిముసుఁగుకూడ కావలసివచ్చినదా! శృంగారనాయకు లెవ్వరైన నీమొగ మాశపడి చూచెదరని భయపడుచున్నావా? లేక నీకు దృష్టి తగులునని భయపడుచున్నావా? లోపలికిపోయి నీయజమానురాలివద్ద సెలవుపుచ్చుకొని. నీమేలిముసుఁగును బట్టలను తెచ్చుకొని వేగిరము రా. అయిదునిమిషము

లలో నీవు మాయిల్లు విడిచిపోవలెను. ఊఁ! వేగిరము, వేగిరము! లోపలికి నడువు.

రాగ—(లోపలికి పోవుచున్నది.)

సుద—ఓహో! చెఱుపు చేయుటకిదియెంతగొప్పతంత్రము పన్నినది! పెద్దతనములో జనకులకు కొమార్తెలు తెచ్చు సుఖము లిటువంటివే.

ఉ. పుత్త్రిక లుద్భవిల్లినను పోవును సౌఖ్యము కొంత తండ్రికిన్;
చిత్రము! శాంతియుండదిటు చిత్తములో క్షణకాలమేనియున్
ధాత్రిని నిర్వహింత్రు కడదాఁకెటులోనను చెప్పబుద్ధులన్
బుత్రిక లిట్లుఘాతికరముల్ వెతఁగూర్తురు కన్నవారికిన్.

గీ. కటకటా! తండ్రి కెంత దుఃఖంబు గలుగు!
తిరుగఁబడుచును గన్నీరు తెచ్చుకొనుచుఁ
బలుకు వినకుండఁ బుత్రికల్ మొఱఁగిరేని,
కటకటా! తండ్రి కెంత దుఃఖంబు గలుగు!

ఉ. యుక్తులుపల్కి మించుదురహో నెఱప్రాయము రాకమున్నె; యా
సక్తిని బుత్రికల్ ప్రియులచక్కికిఁ బుచ్చి కలంతు రుల్లముల్;
యుక్తవిచారముల్ సలిపి యొక్కటఁ దండ్రికి దుర్భరవ్యథన్
శక్తికొలంది వంకలిడి చాతురితిన్ వలదంచు రేపుచున్.

గీ. కటకటా! తండ్రి కెంత దుఃఖంబు గలుగు!
విఱ్ఱవీఁగుచు లోలోన విసుఁగుకొనుచు
మొఱకుఁదనమునఁ బుత్రికల్ మొఱఁగిరేని,
కటకటా! తండ్రి కెంత దుఃఖంబు గలుగు!

[భానుమతి రాగమంజరి వేషముతో మేలిముసుఁగు వేసికొని బట్టలమూట చంకఁ బెట్టుకొని వెక్కివెక్కి యేడ్చుచు ప్రవేశించుచున్నది.]

సుద—రాగమంజరీ! ఈదారిని. ఈదారిని. ఆహా! ఇప్పుడెంత దుఃఖముతో మాయిల్లు విడిచి పోవుచున్నావు! నీరెండుచెక్కుల మీఁద కన్నీరుకాఱుటకు కంటఁ మిరపకాయ పెట్టుకున్నావా యేమి? నీవీలాగున తల యెవ్వరికిని చూపక ముసుఁగులో దాఁచుకొనిపోవలసినదే. ఇఁక నీవు నీమనసువచ్చినంత నేపేడువు. ఇఁకనీవెన్ని ఉమార్పణాలు చెప్పినను నేనొక్కటియు వినెడువాఁడను గాను. కాఁబట్టి నీవిప్పుడు మౌనము ధరించి పోవుచుండుటయే మంచిపని చేసినావు. ఈదారిని. ఈదారిని. (ముందు భానుమతియు వెనుక సుదర్శనవర్మయు నిష్క్రమించుచున్నారు.)

[అప్పుడు రాగమంజరి మరల ప్రవేశించుచున్నది.]

రాగ—ఓ మహాబుద్ధిమంతుఁడవైన సుదర్శనవర్మా! పొమ్ము! పొమ్ము! నీమరాగ్రహామునకును ముష్కరత్వమునకును తగినఫలము కలిగినది! ఇప్పుడు నేనే నాయజమానురాలనయి, ఆమెవలె నటింపఁ గలుగుటకయి నాసామర్థ్యము చూపవలెను. నాభాగ్యముచేత నా యుపాయము నిరంతరాయముగా కొనసాగెనా, ఇఁక యావజ్జీవమును నేను నిజముగా గృహాయజమానురాలనే యగుదును. నే నిప్పుడు పోయి నాయజమానురాలు నాకిచ్చిపోయిన నగలు మొదలైనవలంకరించుకోవలెను. (అని నిష్క్రమించు చున్నది.)

౮ రంగము—సుదర్శనవర్మగృహముయొక్క వీధివాకిలి.

[సుదర్శనవర్మయు, రాగమంజరి వేషముతో నున్నభానుమతియు ప్రవేశించు చున్నారు.]

సుద—రాగమంజరీ! అదిగో నీవు వీధిలోనికి పోవుటకు మార్గము. ఇంక ప్రపంచ మంతయు నీవువిచ్చలవిడిగాతిరుగవచ్చును. పరుగెత్తు. ఓపాపాత్మురాలా! పరుగెత్తు. ఆముందెవడో నీవంక చూచుచు తారుచున్నాఁడు. కామపాలుఁడయి యుండవచ్చును. అతనివద్దకేపో. విన్నావా? నీశ్రమ కతని నే పరిహార మడుగు. నిన్ను మాయింటినుండి పంపివేయుట కతఁడే కారకుఁడు గనుక,నిన్నతఁడు స్వీకరించుట న్యాయమని యతనితోనే మొఱ్ఱపెట్టుకో.

భాను—(నిష్క్రమించుచున్నది.)

సుద—ఇప్పటికి దీనిని వదల్చుకొన్నాను. దైవానుగ్రహము చేత నే నింక నాప్రతిజ్ఞను నిలువుకొని,సురక్షితముగానాకోమార్తెను నిరోధములో నుంచఁగలను. నేను పోయి గదితలుపులు తాళము వేసి వచ్చెదను. (అని నిష్క్రమించుచున్నాఁడు.)

---

౯. రంగము వీధిలోని వినోదమంటపము.

[సుదంతయు, పరిచారికయు ప్రవేశించుచున్నారు.]

పరి—అమ్మా! నీవిప్పు డెక్కడకు పోఁదలఁచుకొన్నావు?

సుదం—నాసవతితల్లియొక్క దౌర్జన్యమును విజయవర్మయొక్క దుడుకుతనమును తప్పించుకొనుటకయి యెక్కడికి పోయినను సరే.

పరి—అమ్మా! విజయవర్మయిచ్చిన తాళము చెవిమూలముగానే

మనము తప్పించుకొని యీవలఁ బడఁగలిగితిమిగనుక, మనమాతనిని వెదకి కనుఁగొని మనవందనము లర్పింపఁ బోవుదమా?

సుద—అతనియొద్దకు పోవద్దు. అతఁడు నా కతికోపము తెప్పించినాఁడు. (అని ప్రక్కకు తిరుగుచున్నది.)

[అప్పుడు భానుమతి ప్రవేశించుచున్నది.]

భాను—ఇప్పు డింటినుండి వెడలఁగొట్టించుకొనఁబడు నంత వఱకు మాయుపాయము సఫలమయినదిగాని యిఁక కామపాలుఁడు నాకగపడుట యెట్లు సంభవించును? అతని పేరు చెప్పి యడిగినపక్షమున నన్నెవ్వ రానవాలు పట్టుదురోయని నా కాతనిగుఱించి విచారించుటకే భయమగుచున్నది. ఇప్పుడు నా చెలియైనసుదంతయొద్దకు పోవలెనని యున్నదికాని; అనంగనాచి నామీఁద తప్పులెన్ని చీవాట్లు పెట్టునేమో యని భయమగుచున్నది.

పరి—అమ్మా! అట్లయినపక్షమున, నీసఖియైనభానుమతి నిన్నాదరించి లోపల పెట్టుకొనునేమో ప్రయత్నంచేసి చూచెదవా!

సుదం—అక్కడకు పోఁగూడదు. పితృభక్తి దాని కతివిస్తారముగనుక రహస్యము బయలఁబెట్టి నన్నది రవ్వపెట్టునేమో!

భాను—సుదంతది కొంత శాంతస్వభావము; నేనుచేసిన దతిసాహసకార్యమని యెంచును.

సుదం—భానుమతికి తండ్రియెడల గౌరవముమెండు; అది నాక్రూరత్వమును మన్నింపదు.

భాను—(ప్రక్కకుతిరిగి సుదంతను పరిచారికను జూచి) ఓహో! ఈవచ్చెడువా రెవరు? వీరిలో నొకతె నిశ్చయముగా సుదంత. అయినపక్షమున, నేనుదానియందు నమ్మక ముంచెదను. భనుమంతా! (అని ముందుకు నడుచుచున్నది.)

సుదం—భానుమతీ! ఏమియీవింత! నీవు మేలిముసుఁగు కూడ వేసికొన్నావు!

భాను—నేను మాతండ్రిగారియింటనుండి పాఱిపోయివచ్చితి నన్నవార్త విన్నపక్షమున నీకింతకంటెను మహాద్భుతముగా నుండును.

సుదం—నిశ్చయముగా నాకత్యద్భుత మగుచున్నది. ఇప్పుడు నేనుకూడ మాతండ్రి యింటినుండి పాఱిపోయి రాకుండిన పక్షమున ఈయవివేకకార్యము చేసినందుకు నిన్ను తప్పక తలవాచునట్లు చీవాట్లు పెట్టియుందును.

భాను—ఓచెలీ! సుదంతా! (అని కౌఁగిలించుకొనుచున్నది.)

సుదం—ఓపిఱికిచెల్లెలా! నీవెక్కడకు పోవుచున్నావు!

భాను—నాప్రియుని వెదకుటకయి పోవుచున్నాను. ఇప్పుడు నాయన్నగారిని కలిసికొనుట నీకసమ్మతము కాదనుకొనెదను.

సుదం—నిశ్చయముగా నాకసమ్మతమే. అతఁడు నావద్ద మిక్కిలి పచ్చిగా ప్రవర్తించినాఁడు గనుక, ఇఁక నేనాతని నెప్పుడును క్షమింతు ననుకోను.

ద్విపద. గాఢాంధకారంబు గ్రమ్మియెల్లెడల
గాఢనిద్రనుబూని కాముకుల్ కూడ
బడలిక యడఁగంగఁ బఱుపుపైనొక్క
గడియసే పొఱగెడు ఘనరాత్రివేళ,
తనయుని గోల్పడ్డ తల్లికై వడిని
వనట నొందుచు శోకభరమున మునిఁగి
వాడినతీఁగవలె సొమ్మసిల్లి
వీడనివ్యథతోడ వేవేగ నేను
నించుకసేపు కన్నిట్టె మూయంగ

నెంచి మంచముచేర నింతలోఁ బ్రియుఁడు
వచ్చి కౌఁగిట నన్ను వడిఁ గదియించి
చెచ్చెర బలిమిమై చెక్కు ముద్దాడి
చెడుబంధువులు పెట్టు చెఱనుండి తాను
వడి నన్ను రక్షింప వచ్చితి నంచుఁ,
బలుమాఱు చెక్కులు పట్టి ముద్దాడి
బలవంతముగ నన్ను బాధింపఁ జొచ్చె.
అతనిపై నప్పుడే నలుక వహించి
యతివేగ గదినుండి యవలఁ బొమ్మంటి;
ఒకసారి చను నప్పు డొసఁగితి నేని,
మొక మోడక ప్రియుండు మొనసి మఱింత
పీడించి బెడదలు పెట్టి కార్యంబు
పాడుచేయునో యంచు భయ మయ్యె నాకు.

భాను—ఈప్రకారముగాఁ జేసినందుకు క్షమింప వేఁడుకొమ్మని యిప్పుడే యతనిని నీవద్దకుఁ బంపుదునుగాని, నే నిల్లువెడలి వచ్చితి నని మఱికొంతసేపటివఱకును నాయన్నగారికి తెలియనిచ్చుట నాకిష్టము లేదు. సుదంతా! నీవిప్పు డెక్కడకుఁబోయి తలదాఁచుకొనెదవు?

సుదం—ఇక్కడ శారదామఠమునందుండు పరివ్రాజిక నా కాప్తురాలు. నేనామెయొద్ద సురక్షితముగా నుండెదను. అక్కడకు నీవు కూడ నాతో రమ్ము.

భాను—నేను రాను. నేను మొట్టమొదట కామపాలునిఁ జూడవలెనని నిశ్చయించుకొన్నాను. నానిమిత్తమయి నాప్రియుని వెదక నియమింపవలసిన ప్రధానపురుషుఁడే యిప్పుడు మనదిక్కునకు వచ్చుచున్నాఁడు.

సుదం—భానుమతీ ! అతఁ డెవఁడు? అతనిదేదో క్రొత్తముఖముగాఁ గనఁబడు చున్నది.

భాను—అతఁడు తనచేత నేనిప్పుడు నాకార్యమును చేయించుకొనుటకు ముఖ్యముగా తగినవాఁడు. రేపే యతనిని నేను వివాహమాడవలెనని ముహూర్తనిశ్చయము చేయఁబడినను ఈయుజ్జయినీనగరవాసులలో నెల్ల నామొగ మెప్పుడును చూడని వాఁ డతఁ డొక్కఁడే.

సుదం—అతనిని నీవుమాత్రి మెట్లెఱుఁగుదువు?

భాను—అతఁడు నిన్నమధ్యాహ్నము మాతండ్రిగారితో మాటాడవచ్చినప్పుడు నాచెలికత్తె చూపఁగా నేను నాగదికిటికీలోనుండి చూచినాను.

సుదం—మంచిది. ఇఁక నేను పోయెదను.

భాను—సుదంతా! నిమిషము నిలువుము. నామనస్సున కొకయాలోచన తోఁచుచున్నది. అవశ్యకము వచ్చినయెడల నీపేరు పెట్టుకొనుటకు నాకు సెల విచ్చెదవా?

సుదం—నాపేరు పెట్టుకొనుటవలన నీగౌరవము చెడునేమో! అయినను నీ కాక్షేపణ లేకపోయినయెడల నీయిష్టమువచ్చినట్లు నీవు నాపే రుపయోగించుకో వచ్చును. నే నిఁక నిలువఁగూడను. (అని పోవుచు) ఓభానుమతీ! నీయున్నగారిని నీవు చూడ తటస్థించిన పక్షమున కాళికాశక్తి గుడివీధిలో కుడివరుసను నాలుగిండ్లు దాఁటిన తరువాత రథమున కెదురుగా నున్న శారదామఠములోని గౌతమి యను పరివ్రాజికవద్ద నేనున్నానని నీ వతనితో చెప్పుకుమా.

భాను—అహహహహా! అతఁడు నిన్ను చూడకుండుటకయి నీవు చెప్పినగుఱుతుల నన్నిటిని నేను మఱచిపోక శ్రద్ధతో జ్ఞాపక

ముందుకొనదగునులే.

(సుదంతయు, పరిచారికయు, నిష్క్రమించుచున్నారు.)

భాను—ఆవచ్చుచున్న నాదూత ఆత్మస్తుతి ముగించి సమీపమునకు వచ్చుచున్నాఁడు. (అని మరలుచున్నది.)

[వసుకాముఁడును, చంద్రకేతుఁడును, ప్రవేశించుచున్నారు]

వసు—(తనముఖమును చిన్నయద్దములో చూచుకొనుచు) ఓయీ! చంద్రకేతుఁడా! నామీసములసొగసు చూచుకొనఁగా నా మనస్సులో నాకే సంతోషమగుచున్నది.

చంద్ర—అవునుగాని యిటువంటిముఖముతో పోయి నీవు నీప్రియురాలిని నెట్లు సంతోషపెట్టఁగలవు?

వసు—ఏమి? నామొగములో నేమియందము తక్కువయున్నది? నాకన్నులతో చూడఁగా నావదనారవిందము సుందరుల హృదయముల నాకర్షించునదిగానే కనఁబడుచున్నదే! ఈమెలిమీసములనుజూచి కూడ మోహింపకపోయినయెడల, నేనాయువతి వివేకరా లనుకోను. (భానుమతిని జూచి) అదిగోచూడు. ఈమీసములను జూచి వలచి యాసుందరి యెట్లు సమీపించుచున్నదో!

భాను—అయ్యా! మీసాయ మాశించి వచ్చిన యీసుందరిని కొంచె మనుగ్రహించి రక్షించెదరా?

(అని మొగము తెర తీయుచున్నది.)

వసు—ఓహో! ఈమె సౌందర్యరాశిగానున్నదే! మిత్రుఁడా! తప్పక యీచక్కనిచిన్నది నన్ను వలచియేవచ్చినదిసుమా. ఓసుందరీ ముందుగా నేను నీపేరు తెలియఁగోరెదను.

భాను—(తనలో) ముందుగా నేనేయాలోచించుకొని మెలఁకువపడుట మంచిదే యయినది. (ప్రకాశముగా) నాపేరు సుదంత.

వసు—ఏమీ! నీవు మాధవసేనుని కూఁతురవా? నీవింటి నుండి పాఱిపోయినావని త్రోవలో నేనింతకుముందే విన్నాను.

భాను—నేను కామాతుర నయి వచ్చినదానను. ఇదే నా యెడగల తప్పిదము. రసికశిఖామణివయిన నీవు కామార్తనయివచ్చిన నన్ను పరులకు పట్టి యొప్పగింపవని నమ్మి నీపాలఁ బడినాను.

వసు—ఓయీ! చూచినావా? పాపము! ఈచిన్నది నన్ను కామించి వచ్చినది—ఓసుందరీ! నిన్నన్యుల కప్పగించుటవలన నా కేమిలాభ మున్నది? నన్నావిషయములో నీవు నమ్మఁగొనియుండుము. నీవు కామార్త వని చెప్పుచున్నావే, కామవిషయములో మాత్రము నీకోరిక సఫలము కానేరదని చింతిల్లుచున్నాను.

భాను—అయ్యో! ఎందుచేత?

వసు—ఈవఱకే నాకు వివాహనిశ్చయ మయినది. ఓచంద్రకేతూ! కాలేదా?

భాను—ఆమాట సత్యమే కాని, నాప్రార్థన వినుము.

వసు—నేను వినను వినను. నేను విన్నప్రయోజన మేమి? ఇఁక నిన్ను నేను వివాహపూర్వకముగా పరిగ్రహించుట సంభవింప నేరదు. మఱియొకవిధముగా నీయభిమతమును తీర్చుటకు నేనొడఁబడినయెడల, నీకన్నగారో తమ్ముఁడో యొకఁ డుండి నేను చేసిన యుపకారమును చింతింపక కృతఘ్నుఁడయి మీఁదిమిక్కిలి నా గొంతుక కోయరావచ్చును. కాఁబట్టి నీవుమాఱుమాటాడక మరల వచ్చినదారినే యింటికి విజయం చేయుము.

భాను—(తనలో) ఓరి పరమచండాలుఁడా! (ప్రకాశముగా) అయ్యో! నేనిల్లువిడిచి వచ్చినది కామపాలుని నిమిత్తము.

వసు—ఏమేమీ! నానిమిత్తము కానేకాదా? నీవు నన్నే

కామింపనే లేదు?

భాను—లేదు. నిన్ను కామింపనేలేదు.

వసు—అట్లయినపక్షమున నీవు పరమసాహసికురాల వయిన పాపచింత లేనిమూఢురాలవుగా నున్నావే. నేనీసంగతి తప్పక నీ తండ్రితోఁ జెప్పెదను.

భాను—ఇదేనా నీరసికత్వము?

వసు—చెప్పెదను తాళు. నీవు కామపాలుఁడని కాదా యిప్పుడు చెప్పినావు? దీనివల్ల నేను కొంతలాభము పొందవచ్చును. కామపాలుఁడా!

భాను—నిస్సందేహముగా నీవు కామించెడుసుందరిని నీవెప్పుడయిన దక్కించుకోఁ దలఁచినయెడల, తప్పక నీవు కామపాలుని నా యొద్దకు తెచ్చి నాకొప్పగింపనే యొప్పగించెదవు.

వసు—అవును నేనాపని చేసెదను. చెలికాఁడా! భానుమతి విషయములో కామపాలుఁడు నాకక్కడ ప్రతిపక్షిగా నున్నాఁడు. అతనిని నేనిప్పుడీచిన్నదాని కంటఁగట్టఁ గలిగితినా, ఇఁక నక్కడ నాకడ్డువచ్చువాఁ డెవ్వఁడును లేక నే నప్రతిహతమనోరథుఁడ నగుదును. చెలికాఁడా! ఇది మంచి ఆలోచన ఔనా? కాదా?

చంద్ర—అవును, నిరుపమానమైనయాలోచన.

వసు—నా కుపాయముల కెప్పుడును తక్కువలేదు. ఈమన స్సుపాయములపుట్ట నాబుద్ధిసూక్ష్మత కనిపెట్టినావా? సుదంతా! నామిత్రునియందు విశ్వాసముంచి కొంచెముసేపు నీవీతనివశమున నుండెదవా?

భాను—అయ్యో! నేనునిన్ను నమ్మికొని యుండవచ్చును గదా!

చంద్ర—ఓ సుందరీ! నేను నిన్ను మోసపుచ్చుట యెప్పుడును సంభవింపనేరదు.

ద్విపద. కడుపునిండను నాకుఁ గల్లలుండినను,
చెడుగుచేయఁగ లేను, చెలువరో నీకు;
నమ్మికేదియు నీవు నన్నుఁ గోరకున్న,
నమ్ము నీ చెలువమ్మె నను సాధుఁజేయు.
వంచింప రెవ్వరు వసుధలో నిన్ను·
నెంచఁ డే యొగ్గు నీకెంతయున్న్యుఁడును;
బద్ధానురాగులై పడుచువారొప్ప,
వృద్ధులు మిత్రత వెలయింత్రు నీకు.
భవదీయహృదయంబు పరునిపై నింత
తవిలి యున్నదటంచుఁ దా మెఱింగినను,
తరుణవయస్కులు తమయీర్ష్య విడిచి
ధరియింత్రు సోదరత్వంబు నీయెడను.
ముదిత! కల్గదు నీకు మోసమన్మాట,
యొదవ దేకీడు నీ కువిద యిచ్చోట.
ఆడరి వృద్ధులు మిత్రు లౌదురు నీకు;
పడుచువా రెల్లను భ్రాత లయ్యెదరు.

వసు—ఓ చంద్రకేతూ! నీ వీమెను మాయింటికి తీసికొని పొమ్ము. నేను వేగిరము సుదర్శనవర్మ యింటికి పోవలెను. ఓసుందరీ! నీవు భానుమతి నెఱిఁగి యుండవచ్చును. ఆమె సౌందర్యముచేత దేవతాకన్యలను మించి యుండు నఁట! సత్యమేకదా?

భాను—ఈవిషయములో నేను నీతో నేకీభవింపఁజాలనందుకు నన్ను క్షమింపవలెను.

వసు—అట్లనెదవేమి? నా కామెసౌందర్యమును గుఱించి యుండఱును నేకవాక్యముగాఁ జెప్పుచున్నారే.

భాను—ఆమెయొక్క తండ్రి కలిపతిపాతము. అందుచేత నతఁ డందఱితో నట్లు చెప్పుచుండును. ఆమెది కొంచెము ముదురు ముఖమైనమాట నీవు పోయి చూచినప్పుడు నీకే తేటపడును.

వసు—చెలికాడా! ఇది యంతయు కేవలాసూయ సుమా. ఓ సుందరీ! మీవంటిపడుచుకన్య లొకరినొక రెప్పుడును చక్కనివా రని యొప్పుకోరు. ఓమిత్రుఁడా! నామాట విను. నీవు కామపాలుని వెదకి తెమ్ము; నేనీసంకిలి యతనికి తగిలించెదను. నే నెంతో భాగ్యశాలిని గనుక నా కీయుపాయము తోఁచినది. ఓ సుదంతా! నేను నీకు పరమవిధేయుఁడను. ఓమిత్రుఁడా! నీవు నీపనిమీఁద నుండుము. ఓ సుందరీ! నాప్రియురాలు నారాక కయి యెదురు చూచుచుండును; నేనామెవద్దకు పోవలెను. నేనిప్పుడామెనవ్వుమొగముచూడక యెట్లు తాళఁగలను?

భాను—నీవు పెండ్లికొడుక వయి శీఘ్రముగా రమ్ము. అయినను నీ వాపెండ్లి సంతోషములో నేనిక్కడ నాప్రియునికి దూరస్థురాలనయి యొంటిపాటున పశులను నమ్మి వారికి శరీర మప్పగించి యీ యవస్థలో నున్న మాటమాత్రము మఱచిపోకుము.

వసు—సుందరీమణీ! నీవు సర్వమునకును నామిత్రుని నే నమ్ముకొని యుండుము. ఇతఁడే నీకు సేవకుఁడును రక్షకుఁడును మార్గదర్శియు నగును.

చంద్ర—ఓసాధ్వీ! నామీఁద నీవేల యనుమాన పడెదవు? ముందుగా నాచేత సేవ చేయించుకొని మఱి నన్ను నిరాకరింపుము. నీవు నన్ను నమ్మినప్పుడు నిన్ను మోసపుత్తునా? నీవు వ్యసనముగా

నున్నప్పుడు నిన్ను దుఃఖపెట్టితినా? ఓసాధ్వీ! నాయందు నీకీసందేహమేల? నాచేత నీయిచ్చవచ్చినపని చేయించుకొమ్ము.

భాను—ఏవిషయమునందైనను నాకు ద్రోహము తలఁచిన యెడల, నీ వెప్పుడును సుఖపడకుందువుగాక!

వసు—ఏవిషయమునందైనను నాకు ద్రోహము తలఁచిన యెడల, ఇతఁ డెప్పుడును సుఖపడకుండునుగాక!

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

ద్వితీయాంకము

౧. రంగము సుదర్శనవర్మ పడకగదితోఁజేరిన పుస్తకనిలయము.

[సుదర్శనవర్మయు, వసుకాముఁడును ప్రవేశించుచున్నారు.]

సుద—ఆహాహా! తండ్రిని టక్కుపెట్టి పాఱిపోయినదా? ఎంతపనిచేసినది! కూఁతు రిల్లు విడిచి జాఱువఱకునుతండ్రికి తెలియనే లేదుగా! అయ్యో! పాపము! మాధవసేనున కెంతదురవస్థ పట్టినది!

వసు—అవును. ఆమెను నేనే కామపాలునియొద్దకు తీసికొనిపోవలెను. ఈ యుపాయముచేత నీకూఁతురివిషయమయి నాకీఁకముందతఁ డేమియు తొందర కలుగఁ జేయకుండ నేనతని కాళ్ళకు బంధము తగిలించెదను. అతనిని నేనెట్లు వలలో పడవేయుచున్నానో చూచినారా? నాది మంచియుపాయమా కాదా? ఇది మహేంద్రజాలము.

సుద—నిస్సంశయముగా నీది నిరుపమానమయిన మాయోపాయము. దానిని వానియొద్దకు తీసికొనిపోయి తప్పక వలలో పడవేయుము. హాహాహా! వృద్ధదశలో మాధవసేనున కెంతగతి పట్టినది! పడుచుకుఱ్ఱ దాముసలివాని నిట్లే మోసము చేసినదే.

వసు—స్త్రీలు నక్కలవలె మాయలమారులు. దానిలోనున్న మర్మమిది.

సుద—వారి మాయలమారితనము బుద్ధిహీనులవద్ద పనికివచ్చునుగాని మనవంటివారివద్ద పారదు. నాకూఁతు రెందుచేత నావద్ద నట్లు మాయచేయదు? ఏదీ? అది నన్ను మోసపుచ్చుమను చూతము.

వసు—మీరన్నది సత్యము. తెలివిగలవారివద్ద వారియాటలు సాగవు. జగత్తులోని యేస్త్రీవచ్చి నన్ను మోసముచేయఁనో చేయుమనండి. ఎప్పటికిని చేయలేదు. నామేనత్త చిన్నప్పుడు నాకు బృహస్పతియని పేరు పెట్టినది. ఈభూలోకబృహస్పతికి నెఱజాణలను మించిన మాయలు తెలియును.

సుద—ఒక్క మాధవసేనునివంటి వెంగలిమాత్రమే సులభముగా మోసపోవును.

వసు—కామపాలునివంటి యమాయకుఁడును మోసపోవును.

సుద—సత్యము. వీరిద్దఱును తప్ప లోకములో నింతసులభముగా మోసపోవు తెలివిమాలినవారు నాకీవఱ కెక్కడను కనఁబడలేదు. రమ్ము; నీవుపోయి నాకొమార్తెను చూచుట కిది మంచిసమయము. ఓవసుకామా! ఇప్పు డీభానుమతియొక్క మనోదుర్గమును నీవొంటిగా ముట్టడివేయవలెను.

వసు—మీరు నావెంటవచ్చి నన్నామెకొప్పగించి—

సుద — నేను రాను. తన తిరుగుబాటుతనమును విడిచిపెట్టువఱకును దానిముఖము చూడననియు దానితో మాటాడననియు నే నొట్టుపెట్టుకొన్నాను. నీశక్తిచేత దానిని నాయాజ్ఞకు బద్ధురాలగునట్లు చేయుము. దానికిప్పుడు తండ్రియు భర్తయు నొక్కసారిగా నేలభింతురు.

వసు — నే నొంటిగా నామెతో మాటాడి యొప్పింపలేను. అటువంటి యసమానసౌందర్యమును జూచినప్పుడు భయగౌరవముల చేత నానోట మాటరాదు. కురూపముగలవారిని జూచినప్పుడో మనస్సున కంతశంకలేక మాటాడుట కొకవిధముగా ధైర్యముకలుగును.

ద్విపద. అందమంతగ లేని యది యైన నాకు
మందహాసము గల్గు మగువయె చాలు;
సకియ లావంచును సన్నం బటంచు
వికలాంగి కాదేని, విడనాడ నేను
ఇంతి నల్లని దైన నెఱ్ఱని దైన
నింతయు శంకింప హృదయ మందేను.
కలికి కన్నులు నల్లకల్వలెయైన
వెలిదమ్ము లైనను వెనుదీయ నేను
ఆసతి నెమ్మొగం బది యట్టిదైన
మీసముల్ లేవేని మెత్తు నేనదను
కులకాంత కందంబు కోరి పల్మాఱుఁ
దలపోయఁగా నేల? దక్కినఁజాలు.

సుద — ఓవసుకామా! భానుమతిని జూచినతరువాత నీవీయభిప్రాయమును మార్చుకొందువు లే.

వసు — ఓసుదర్శనవర్మా! మీతోడి బంధుత్వగౌరవమే —

సుద—ఆసౌందర్యమునుజూచి నీవానందపరవశుఁడ వగుదువు. తండ్రినయిన నే ననవలసినమాట కాదుగాని, నిజముగా నాకూతురు సౌందర్యమునం దద్వితీయురాలు సుమా! నీవు నాకన్నులతోఁ జూడఁ గలిగినపక్షమున, సోగలయినభానుమతి వెలిదళుకు చూపుల యందొక వింతయైన జాణతనముకనఁబడి నీకిప్పుడదినాకూఁతురగుట స్మరణకు రాకపోదుసుమా.

వసు—ఆమె నామనసువచ్చిన జాణ.

సుద—అది మందహాసము చేసినప్పుడు బుగ్గలు కొంచెము సొట్టలు పడి మొగమున కొక వింతయందమును దెచ్చును. సొట్టలు పడినప్పుడే బుగ్గలు విశేషసుందరముగా నుండునో పడనప్పుడే యుండునో నీవు కనిపెట్టలేవు.

వసు—ఆమె నామనసువచ్చిన యందకత్తె.

సుద—నిగ్గుటద్దములవంటి నునుతళుకుచెక్కులమీఁద వెలి బెళుకు చూపులు వ్యాపించి చెక్కుల కొకక్రొత్తకాంతినిగూర్చి నీ దృష్టిని మిఱుమిట్లు కొలుపును.

వసు—ఆమె నామనసువచ్చిన శోభావతి.

సుద—దానిశరీరము బంగారుచాయనుమించి, కరచరణాదుల యందున్న శుద్ధసువర్ణభూషణములను కాంతిమంతములనుగాఁ జేయుచుండును.

వసు—ఆమె నామనసువచ్చిన సమ్మోహనయంత్రము. ఇఁక నా కామెకంఠస్వర మెట్లుండునోమాత్రము తెలిపి కర్ణోత్సవము చేయుఁడు.

సుద—శ్రావ్యతమముగా నుండును. నీవు దానిచేత నొక్క సారి కంఠ మెత్తి పాట పాడింపఁ గలిగితివా, నీ వత్యంతసంతోషపర

వశుఁడ వగుదువు. భానుమతి భూమికి దిగివచ్చినసరస్వతి. రూపము ధరించిన కేవల గాంధర్వవిద్య. సువర్ణవల్లో నింక పనిలేదు. నీవు తెమ్ము. దానిపరిచారిక యిప్పుడు గదిలోనికిఁ దీసికొనిపోయి నిన్న చ్చట విడిచి వచ్చును.

వసు—నే నింక ధైర్య మవలంబించి, యామెకు మాను లకు నిర్భయముగా తల యొగ్గెదను.

సుద—ఓ యభినవబృహస్పతీ! నీవు పోయి చిత్తవృత్తి నను సరించి దాని నుపసర్పించి, నీవశము చేసికొనివచ్చి, నాకిప్పుడే నీ బుద్ధికుశలతకు నిదర్శనము కనఁబఱుపవలెను సుమా.

వసు—నామిత్రుఁ డయిన చంద్రకేతుఁ డిప్పుడే నాకొఱ కెక్కడకు రావలెను. రాఁగానే నాకుఁ దెలియఁబఱచెదవా!

సుద—అలాగుననే తెలియఁబఱచెదను. ఓ చతురికా! ఇటురా.

చతు—(ప్రవేశించి) అయ్యా! వచ్చినాను.

సుద—అది నీకు గది చూపును, దానివెంటఁబొమ్ము. ఏమి! నీవు తల వ్రేలవేసికొన్నా వేమి? ఈరసికుఁడు ప్రియురాలిని వరించు టకు దీనముఖముతోఁ బోవుచున్నాఁడు!

(అందఱును నిష్క్రమించుచున్నారు)

---

౨. రంగము—భానుమతియొక్క గది.

[వసుకాముఁడును, పరిచారికయు ప్రవేశించుచున్నారు]

పరి—నాయజమానురాలిప్పుడే మీసన్నిధికి వచ్చును.

(అని తలుపువద్దకు పోవుచున్నది)

వసు—తొందర పెట్టఁబోకు, ఆమె సావకాశముగానే రావచ్చును.

పరి—(నిష్క్రమించుచున్నది)

వసు—ఈవల కెన్నఁడును నేనుపలువువిషయములో స్త్రీలతో ముచ్చటించి యెఱింగినవాఁడను కాను. నేనిప్పుడు పరిహాసపాత్రుఁడ నగుదునేమోయని భయమగుచున్నది. విచారణనిమిత్తము నన్ను ధర్మాధికారివద్దకుఁ గొనిపోయి యెదుట నిలిపినప్పుడును నాకింతభయ ముండదు. అదిగో తలుపుచప్పు డగుచున్నది. అవు నామె లోపలి నుండి తలుపు తీసికొని వచ్చుచున్నది. పెళపెళలాడుచున్న యామె చీరచప్పుడే నాచెవికి తిరస్కారశబ్దముగా వినఁబడుచున్నది.

రాగమంజరి—(భానుమతి వేషముతో ప్రవేశించుచున్నది)

వసు—(తలవంచుకొని) నాప్రాణపద మైనయామెముఖము వంక తేఱిచూచుటకే నాకిప్పుడు సిగ్గగుచున్నది. ఒకవేళ మొగము వంకఁ జూడఁగలిగినను, ఆమె సౌందర్యమును పొడగన్న పిమ్మట నాకు మాటాడుటకే నోరు లేవదు. నన్నామెయే ముందుగా పలుక రించునని కోరెదను.

రాగ—అయ్యా! మీసెల వయిన దని వచ్చినాను.

వసు—(తనలో) ఇక్కడికి మబ్బు విడిపోయినది. ఇంతవఱ కారంభము మర్యాదగానే యున్నది. (ప్రకాశముగా) శ్రీమతీ! ప్రియురాలా! నే నవధానుఁడనయి యున్నాను.

రాగ—అయ్యా! సంభాషణ జరపవలసినవారు మీరు; విన వలసినదానను నేను.

వసు—(తనలో) ఈమాటలోఁగూడ నాయెడ తిరస్కార భావమేదియు లేదు. ఇఁక నేను తలయెత్తి చూడవచ్చును. ఇంత వేగిరము చూడఁగూడదు. ఈటక్కరి ప్రియురాలి సౌందర్యవీక్ష ణమువల్ల మరల నోటినుండి మాట రాదేమో!

రాగ—అయ్యా! మీలో మీరేదో యాలోచించుకొనుచున్నారు. ఈపాటి పీఠమును స్వీకరింపుఁడని నేను మిమ్ము వేఁడవచ్చునా?

వసు—(తనలో) అంతకంతకు నాయం దీమెకు దయ హెచ్చుచున్నట్లున్నది. నారూపము చూడఁగానే యీమె కాశ పుట్టినది. నాయొయ్యారమిక్కడ నిష్ఫలము కాలేదు.

రాగ—అయ్యా! మీరు పీఠముమీఁద దయచేయుఁడు.

వసు—ఓ కాంతా! నీసౌజన్యాతిశయము నన్నిప్పుడు సంతోషసాగరమగ్నునిగాఁ జేయుచున్నది. ఇటువంటి సుందరీతిలకము తన సుందరకటాక్ష వీక్షణములను నాయందు ప్రసరింపఁజేయుటచేత నేను ధన్యుఁడ నయినాను.

రాగ—(చేయి పట్టుకొనుచున్నది.)

వసు—(ఆమెకేసి తిరిగి కన్నెత్తి చూచుచున్నాఁడు)

రాగ—మీరు నానమ్రత కద్భుతపడుచున్నట్లున్నారు.

వసు—అవును. నాకిది కొంతయద్భుతముగానే యున్నది. (తనలో) చెప్పి! ఇది భానుమతి కాదు. దీనికి మాతల్లికున్నంత వయస్సున్నట్లున్నదే!

రాగ—మాతండ్రిగారి యాజ్ఞాబలముచేత నేనునాపూర్వాభిమానము నంతను విడువవలసినదాన నయినాను.

వసు—(తనలో) తండ్రిగారా! అవును. ఈమె భానుమతియే. ఓయీశ్వరా! లోకములో తండ్రులు కొందఱెంత కన్నుగానని వారుగా నుందురు!

రాగ—అయ్యా! వసుకామా!

వసు—(తనలో) ఈమె నిజముగా దొడ్డయిల్లాలు. నాయం దీమె యెప్పుడు తల్లిప్రేమ కనఁబఱచుచున్నది. మొదటినుండియు నేనీమె రూపమునఁ గాశపడక ధనమునకే యాశపడుట మంచిపనియే జరిగినది.

రాగ—అయ్యో! మీ దాసీనులు కారా!

(అని కూరుచున్నది.)

వసు—ఓయిల్లాలా! నన్ను మన్నింపుము. నీసౌజన్యమువల నఁగలిగిన యద్భుతరసములో మునిఁగి నేనింకను తేలుకోలేదు. (తనలో) దత్త్యమువలె దీనిముఖమునిండను సొట్టలేయున్నవే!

రాగ—నాసౌలభ్యము చూచి మీరు వింతపడుచుండుట నా కద్భుతముగా లేదు. వెనుక మీమీఁద నాకపరిమిత ద్వేష మున్న మాట వాస్తవమే యని నేనిప్పుడు మీయొద్దనే యొప్పుకొనెదను. నాతండ్రి నన్ను మిక్కిలి పీడించుటచేత, కామపాలునికి నే నప్పుడు కొంత ప్రోత్సాహము కలిగించినాను. అప్పుడు మీరూపవిషయమయి నాకు వేఱువిధముగా చెప్పినారు.

వసు—ఈశ్వరసాక్షిగా నీరూపవిషయమయి నాకును వేఱు విధముగానే చెప్పినారు.

రాగ—మీరూపమిప్పుడు చూడఁగా నేయిచ్చువఁ బొడిచినట్లు నామనస్సున నాటుకొన్నది.

వసు—ఆలాగుననే నీరూపమును నామనస్సున నాటుకొన్నది. నీమోహము పదునుచ్చులను బొడిచినట్లు నాహృదయములో లగ్నమయి నన్ను విడువకున్నది.

రాగ—ఈవఱకు మనమిద్దఱమును సమానముగానే భ్రమపడినాము. ఇప్పుడు ప్రత్యక్షముగ మన యిరువుర సందేహములును

తిఱిపోయినవి. నేను గర్విష్ఠురాల ననియు ప్రతికూలురాల ననియు మీ రనుకొన్నారు; మీరు రూపమును మర్యాదయు రసికత్వ మును లేని చప్పిడిముక్కు నల్లమొద్దు లని నే ననుకొన్నాను.

వసు—(తనలో) ఈమె యాప్రకారముగా తన సౌందర్యాభి వర్ణనమునుకూడ చేసికొన్న బాగుండును.

రాగ—మీది గంభీర మయిన విగ్రహము. మీ చుఱుకు చూపులేమి! వలపు గొలుపు చిఱునవ్వు లేమి! నాదృష్టికి మీరు ధీరోదాత్తనాయకులుగాఁ గనఁబడు చున్నారు.

వసు—(తనలో) నేనిప్పుడీమెవంక తిన్నగా మఱియొకసారి చూడవలెను. మొదట కనఁబడ్డంత వికారముగా నాకిప్పు డీమె కనఁబడదు.

రాగ—శైవులయం దుండుపాషండలక్షణము మీ మొగమున పీసమంతయినఁ గనఁబడదు, మీయం దన్నియు మహాకులీనుఁ డయినదొడ్డగృహస్థు లక్షణములే యున్నవి.

వసు—(తనలో) మంచిది. ఈమెకంఠమునందు నిశ్చయముగ కావలసినంత మాధుర్య మున్నది.

రాగ—స్త్రీజనోచిత మయిన మర్యాదనతిక్రమించి మిమ్మీ ప్రకారముగా ముఖస్తుతి చేసినందుకు దాసురాలిని క్షమింప వలెను. ఈవఱకు విపరీతముగా విని మోసపోయి యున్న నేను మీమూర్తి విశేషమును జూడఁగానే కలిగిననిర్భరానందమును మనస్సులో నిలుపుకోలేక నా మనోగతమును వెలిపుచ్చినాను.

వసు—ఓప్రాణేశ్వరీ! ఇటువంటి ప్రియవాక్యములను పలికిన యీచిన్న పెదవులను నేనొక్కసారి కృతజ్ఞతాసూచకముగా ముద్దు

పెట్టుకోవచ్చునా? (అని యామెచేయి ముద్దుపెట్టుకొని) ఏమి! ఈ హస్తము దూదికంటెను మెత్తగా నున్నది!

రాగ—అయ్యా! మీయొద్ద మంచి లాలనశక్తి యున్నది. అయినను పెద్ద యేదుపందిముండ్లవలె నున్నమీకఱకు మీసములను మాత్రము మీరు శీఘ్రముగా వదల్చుకోవలెను.

వసు—(తనలో) మంగలకత్తి నా కఱకుమీసములకును నీ బిఱుసుకేశములకును కూడ సమానముగానే పనికివచ్చును. (ప్రకాశముగా) ఒకచిన్న పాట పాడి నాచెవుల కొక్కసారి విందు చేయఁ గలవా?

రాగ—నాది కొంచెము బొంగురుగొంతు కయినను, మీ యానందముకొఱకు నేను సంతోషపూర్వకముగా పాడెదను.
(కొంచెము దగ్గి గొంతు సవరించుకొని పాడుట కారంభించుచున్నది)

వసు—(తనలో) ఈమె తప్పక భూలోకసరస్వతిగా నేయున్నది. నీ వాయాస పడఁబోకు.

రాగ—నాకాయాస మెంతమాత్రమును లేదు. ఆలకింపుము.

ద్విపద. కుసుమకోమలి నొర్తుఁ గోరి తొల్దొల్త
వెసనాయకుఁ డొకండు వేడ్కతోఁ జేరి
పరిశోధనము చేయుపట్టున నతఁడు
పరువడిఁ దనమనోవ్యథ తేటపడఁగఁ
జురుకుచూపులు మీఁదఁ జొప్పించెనేని
తరళాక్షికిని సిగ్గు తల మున్కగా దె?
కర మాతఁడు గ్రహింపఁ గడు గంప మొందు;
అరపంటఁ గెమ్మోవినంట మూర్ఛిల్లు;

గుండెలు తటతట కొట్టుకొనంగ
నిండుభీతిని దేల్పు నెలఁత డెందంబు.
కాని యంతంతకుఁ గ్రమముగా భీతి
తానె యుల్లములోన తగ్గుచునుండు;
తరుణి నాయకుఁ జూచు ధైర్యంబుతోడ;
వరుఁ డామెహస్తంబు వచ్చి పట్టినను,
కరముఁ గూరిమితోడఁ గౌఁగిలించినను,
బాలయు దింతయును సిగ్గు పొలఁతి యామీఁద.
ముద్దియ చిఱునవ్వు మోదంబుఁ దెల్ప
నిద్దఱుఁ బెండ్లికి నేగుదు రొకట;
గుండెలు తటతట కొట్టుకొనంగ
నిండుప్రేమను దెల్పు నెలత డెందంబు.

వసు—ఆహా! నీపాట నాకెంత కర్ణరసాయనముగా నున్నది! ఇప్పుడు నిజముగా నీకంఠస్వరము నాకు ప్రేమాస్పదురాలయి నిన్నుఁబోలి యున్నయొకయిల్లాలిని స్మరణకుఁ దెచ్చుచున్నది.

రాగ—అట్లయిన, నీకు ప్రేమాస్పదురాలు మఱియొకతె కూడ నున్నదా?

వసు—ఓ సుందరీ! నీవు నాయభిప్రాయమును గ్రహింపలేక భ్రమ పడుచున్నావు. నేను మాతల్లిమాట చెప్పినాను.

రాగ—రమ్ము. ఓప్రియుఁడా! ఇటు రమ్ము. నే నింత సులభముగా వశ్యురాల నయినందున కద్భుతప్రమోదములలో మునిగిపోయి నీమనసు కలఁగి యుండుటచేత నీ వేమిచెప్పవలెనో తెలియక తడఁబాటు పడుచున్నావు.

వసు—ఆమాట సత్యము. నీవువశ్యురాలయినవార్త సుదర్శనవర్మతో మనవి చేసి వచ్చుటకయి నన్ను నీవు సంపూర్ణమనోరథుని జేయుట కెప్పుడనుగ్రహింతువో యాశుభవేళ నడుగక జాగు చేసినందుకు నాకిది శిక్ష యనుకొనెదను.

రాగ—ఇప్పుడు నామనస్సులోనున్నది నీతో నిష్కపటముగా చెప్పి వేయవలెను. నాతండ్రియనుమతిమీఁద, నే నెప్పుడును నీసొమ్ము కాఁగలదానను గాను.

వసు—ఏమి? ఎందుచేత;

రాగ—నాతండ్రి కోపావేశముచేత నేను తనయిష్టములో మెలఁగువఱకును నామొగము చూడనని ప్రతిజ్ఞ పట్టినాఁడు; అతని చేతిమీఁదుగా భర్తను చేసికోనని నేనును పంతము పట్టినాను. ఏది యేమయినను నాప్రతిజ్ఞ నేను తప్పను. అతనియెఱుక లేకుండ నన్ను తీసికొనిపోవుటకునై పుణ్యమును సాహసమును నీయొద్ద నున్నయెడల నేను నీదానను.

వసు—అది యుక్తము కాదు.

రాగ—నాకు మఱియొకమాట సరిపడదు. నీవనుమానించెదు పక్షమున—

వసు—(తనలో)ఇది యంత పిచ్చపనిగాఁ గనఁబడదు. ఈమాట ప్రకారముగా నేనీమెను పాణిగ్రహణము చేసికొన్నయెడల, నేనీమె కేమియు బదులు వ్రాసి యియ్యనక్కఱలేకయే యీమెధనమును దక్కించుకోవచ్చును. అప్పుడీమె నొక్కదానిని మాత్రమే కాక యీమెతండ్రినిసహితము నేను మోసము చేయఁగలిగినవాఁడ నగుదును. ఓహో! నాయుపాయముచేత నే నిప్పు డెంతటియదృష్టవంతుడ నగుదును! ఈయాలోచన నేను పరుల కెవ్వరికిని తెలియనియ్యక

నామనస్సులోనే యుంచుకొనెదను. మంచిది. ఈమెను గాంధర్వవివాహమున వరించెదను.

రాగ—మంచిది. ఏనిశ్చయము చేసినారు?

వసు—ఓ హృదయేశ్వరీ! మేరమీఱినసంతోషముచేత నోటినుండి మాటరాక యూరకున్నాను. నీసాహసమునకు నాకు మెచ్చు పుట్టుచున్నది. నీసంకల్పము సంతోషకరముగాముగియును గాక! నీవు చెప్పినయాలోచనకయి నాకృతజ్ఞత తేటపడునట్లుగా నీకెందామర వంటిహస్తము నాకొక్కసారి ముద్దిమ్ము.

రాగ—అట్లయినపక్షమున నీవు నాతోనుద్యానవనమునందు విహరించుటకుమాత్రము మాతండ్రిగారివద్ద సెలవు పొందిరావలెను. ఇక్కడ నీయెడల నేను జూపినయనురాగమును గుఱించిమాత్రము నీవాతనితో లేశమును ప్రశంస చేయరాదు.

వసు—అణుమాత్రమును ప్రశంసింపను. ఈప్రశంసయక్కడ తెచ్చిన యెడల మన యాలోచన సర్వమును చెడిపోదా? యుక్తి పన్నవలసినప్పు డెప్పుడును నీవు నాబుద్ధి నమ్మి యుండుము. ఆవల నొక చిన్న మాయోపాయము నిర్వహింపవలసి యున్నది గనుక కొంచెము నీవు నన్ను విడిచిపెట్టుము. నిస్సందేహముగా నేఁడే నీవు నీతండ్రి నిర్బంధమునుండి తప్పించుకొని పోదువు.

రాగ—ఈకార్యనిర్వహణభార మంతయు నీమీఁదనే నేను విడిచి పెట్టెదను. నీ వొకపట్టున మోసపోవువాఁడవు కావని స్పష్టముగా నే నిప్పుడు కనిపెట్టినాను.

వసు—నీవు బుద్ధిమంతురాలవు. నాసామర్థ్యమును నిమిషములో కనిపెట్టినావు. నీ వన్నది సత్యము.

[అప్పుడు పరిచారిక ప్రవేశించుచున్నది.]

పరి—అమ్మా! వసుకాముతో మాటాడవలసినపని యున్న దని యెవరో యొకగృహస్థు వచ్చి గుమ్మమువద్ద నిలిచియున్నాఁడు.

వసు—ప్రాణేశ్వరీ! అతఁడు నామిత్రుఁడు. నా ప్రాణమిత్రుఁడు—ఓ పరిచారికా! నీ వాతనిని లోపలికి రానియ్యవచ్చును.

పరి—మంచిది. (అని నిష్క్రమించుచున్నది.)

వసు—సమస్తవిషయములలోను మన మాతనిని నమ్మకొనవచ్చును.

[అంతట చంద్రకేతుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

వసు—(మిత్రునితో నేకాంతముగా) అన్నా! ఏమి సమాచారము?

చంద్ర—(ఏకాంతముగా) సుదంతను మీ యింటివద్ద నుంచి వచ్చినాను. నా కెక్కడను కామపాలుఁడు కనఁబడలేదు.

వసు—పోనిమ్ము. అతనిని నేనే వెదకెదను లే. ఓ మిత్రుఁడా! ఇక్కడ నాయంత్రము పాఱుచున్నది. నేను కృతార్థుఁడ నయ్యెదను.

చంద్ర—నీ ప్రియురా లెక్కడ ?

వసు—అదిగో! అక్కడ నిలుచున్నది.

చంద్ర—ఓహో! ఈమె చెడ్డకురూపినిగా నున్నదే !

వసు—ఊరకుండు. (అని మిత్రునినోరు మూయుచున్నాడు.)

రాగ—అయ్యా! నీమిత్రుఁడు నన్నుగూర్చి నేమో యనుచున్న ట్టున్నాఁడు.

వసు—ఇటువంటిరూపమును మున్నెప్పుడును చూచి యుండ

లేదని యత్యద్భుతపడి తనసంతోషమును నాతో తెలుపుచున్నాఁడు. మిత్రుఁడా, కాదా?

చంద్ర—ఇట్టి రూపమును నిశ్చయముగా నే నీవఱ కెన్నడును చూచి యుండలేదు.

రాగ—అయ్యో! నాయందు మీకు దయ గనుక, అట్లు సెలవిచ్చుచున్నారు. ఓవసుకామా! మనమింతట విడిపోవుట మంచిదనుకొనెదను. మన యుపాయమును మఱవకుమా.

వసు—ఓ ప్రాణేశ్వరీ! మఱచిపోను. నీ దివ్యసుందర విగ్రహమువలెనే యీ యుపాయమును నా మనస్సులో శిలాక్షరమువలె నాటుకొని యున్నది. నా భాగ్యదేవతా! పోయి వచ్చెదను సెలవిమ్ము. ఇంకొక్కసారి యీసేవకు ననుగ్రహింపుము.

(అని చేయి ముద్దు పెట్టుకొనుచున్నాఁడు)

రాగ—ఓ మనోవల్లభా! సెలవు గైకొనెదను.

వసు—నేను నీకు సంపూర్ణదాసుఁడను. ఓ చెలికాఁడా! మనము సెలవు పుచ్చుకొనుచున్నాము గనుక నీ విప్పు డేదయిన మంగళవాక్యము పలుకుము.

చంద్ర—ఓ వసుకామా! నేనుజూచిన సుందరులలో నెల్ల నా వర్ణన పనికిరాని దీమె యొక్కతయే నాకు కనఁబడు చున్నది. అయినను నే నిప్పుడు చూచినదానినిబట్టి సమయోచితముగాఁ గొంచెము కల్పించి పాడెదను:—

చ. ఇలవు ని ట్టిదంపతుల నెప్పుడు నెవ్వరుఁ జూడఁ బోరికన్;
   జెలుచన రూపసంపదల బిత్తరిమించెడుఁ గాంతుఁ డిత్తరిన్;
   వలచి పరస్పరంబు నిటు పైఁ బడు మీ దెసుఖంబు ధారుణిన్;
   జెలువకు నిన్ను నీకు నలచెల్వను దైవము చేసె వింతగన్,

సుగంధి. మీరు శాంతదృష్టిచూచి మీకుఁ బుట్టు బిడ్డలున్
మీఁద నేర్పుఁగొంద్రుగాక మేటియౌ విధేయతన్;
మీదుపుత్రు లెల్లఁ దండ్రిమించఁ దెల్వితేటలన్,
మీదుకూఁతు లెల్లఁ దల్లిమించఁ జెల్లు రూపునన్,
తే. గీ. ఎంతపుణ్యంబు! సంతాన మించుకంత
యిట్టిబుద్ధియు నందంబు నెలమిఁగనుట!
వసుధ జీవించియున్నంతవఱకు మీదు
యోగ్యతకు మీకుఁ దగిన మేలొదవుఁగాక!

(అందఱు నిష్క్రమించుచున్నారు)

---

3. రంగము—సుదర్శనవర్మ గృహములోని పుస్తకనిలయము.

[సుదర్శనవర్మయు, విజయవర్మయు ప్రవేశించుచున్నారు]

సుద—కామపాలుని కిచ్చుట కాక్షేపణా? అతనిబీదతనము. అతఁడు ధనహీనుఁడు కాఁడని నీవు చెప్పఁగలవా?

విజ—అతఁడు ధనాధికుఁడు కానిమాట సత్యమే. కాని యతఁడు మొదటినుండియు గౌరవముతో బ్రతికిన ప్రాచీనసద్వంశమున బుట్టినవాఁడు.

సుద—ప్రతీరాష్ట్రమునందును గల బిచ్చగాండ్రందఱును ప్రాచీనకుటుంబములోఁ బుట్టినవారే. వారికిప్పుడు పేరుప్రతిష్ఠయును మాత్ర ముండవు.

విజ—కామపాలుఁడు విశేషసుగుణసంపత్తి కలవాఁడు.

సుద—ఎన్నిసుగుణము లున్న నేమి? ధనవంతుఁడుమాత్రము కాఁడుగదా? అతఁ డుల్లాసపురుషుఁడయి కన్నగాక ఘూర్వ

లార్జించిన ధనమంతయు పాడుచేసికొనుచున్న దుర్వ్యయపరాయణుఁడు కాఁడా ?

విజ—అతనికి మొట్టమొదట పిత్రార్జితధనమే విస్తారముగా లేదు. ఆయున్నవిత్తమును దానధర్మములకు వినియోగించుచున్నాఁడు కాని యెప్పుడును దుర్వ్యయమణుమాత్రమునుచేయ లేదు. అతఁడెప్పుడయిన నీతిమాలినపనులలోఁ బ్రవేశించి మర్యాదచెడఁగొట్టుకున్నాఁడా?

సుద—నీవు వట్టిబుద్ధిహీనునివలె మాటాడుచున్నావు. లోకములో ధనములేనిమర్యాద యెవరికి కావలెను ? మితకబట్టమీఁది సరిగంచువలెనే ధనములేనిగొప్పతనమును పరిహాసపాత్ర మగును.

విజ—మీరు చెప్పినమాట వాణిజ్యము చేసికొనెడు కోమటి నోటినుండి రావలసినదికాని క్షత్రియుఁడు పలుకఁదగినది కాదు.

సుద—ఆకోమటులే యిప్పుడు మనకంటె బుద్ధిమంతులు. వాండ్రను మనవలెనే పూర్వకాలమునందు గౌరవమునిమిత్తము చూచుకొనుచుండిరి కాని యిటీవల ధనమునం దున్నమహిమను తెలిసికొని యిప్పుడొక్క ధనమునే కాని మఱి దేనిని చూడరు. ఓహో! వసుకాముఁడు వచ్చుచున్నాఁడు! ఇతఁ డిప్పుడు వధూవరణ కార్యములో కృతార్థుఁ డయ్యె ననుకొనెదను.

విజ—ఏల కాకుండును? ఏసుందరి యీతని రూపమును జూచిన వలచి పైఁబడదు ? ఈ దివ్యమంగళవిగ్రహము వధూవరణమున కద్భుతముగా తోడుపడి యుండవచ్చును.

(అని నవ్వుపట్టలేక యావలికి లేచి పోవుచున్నాఁడు.)

[అంతట వసుకాముఁడు ప్రవేశించుచున్నాఁడు.]

సుద—ఓయీ ! వసుకామా ! నీవు భానుమతిని ప్రసన్నహృదయురాలినిఁ జేసినావా ?

వసు—నే నామెను ప్రసన్నచిత్తురాలిని చేసినాను.

సుద—దానిగుణ మెంతవఱకు కుదిరినది?

వసు—కొంతవఱకుకుదిరినది. ఆమె నేనను కొన్నదానికంటెవిశ్చయముగా నాయందు బహుగుణము లెక్కువ ప్రేమ నేకనఁబఱచినది.

సుద—నాకన్నతల్లి నీయెడల గౌరవముతో నడుచుకొన్నదా?

వసు—అవు నాకన్నతల్లి నాయెదుట నత్యంతగౌరవముతో నడిచినది.

సుద—ఈమాట వినఁగలుగుటచేత నేను పరమానంద భరితుఁడ నగుచున్నాను. దాని సౌందర్యముచూడఁగానే నీకాశ్చర్యము కలుఁగలేదా?

వసు—నిశ్చయముగా నేనత్యాశ్చర్యపడినాను. మీకొమార్తె కిప్పుడు వయ స్సెంత?

సుద—వయస్సా? పందొమ్మిదింటిలో మూడు తగ్గించు. పదునాఱు సంవత్సరము లున్నవి.

వసు—పదునాఱా?

సుద—అంతకంటె నొక్కమాసమయినను హెచ్చులేదు.

వసు—అంతకంటె నొక్కమాసమయినను హెచ్చులేదు.

వసు—అట్లయిన పక్షమున, ఆయీడు కామెది మిక్కిలి ముదురుముఖముగా కనఁబడుచున్నది.

సుద—ఆలాగా? కానిమ్ము. అంతకంటె చక్కనిదానిని నీ వెక్కడను జూచి యుండవు.

వసు—అప్పుడప్పుడొకానొకతెను మాత్రము చూచుచుందును.

సుద—నీకు భానుమతియందు మాకుటుంబలక్షణము లగపడ లేదా?

వసు—(తనలో) కావలసినన్ని కుటుంబలక్షణములు కనబడినవి. నా కామె కేవలకుటుంబినిగానే తోఁచినది.

సుద—దాని కన్నులయందు తండ్రిపోలిక లేదా?

వసు—(తనలో) తండ్రిపోలికను సులోచనములు మాత్రము తక్కువ.

సుద—దానిముక్కు మేనత్తను, నొసలు ముత్తవతల్లిని పోలియుండ లేదా?

వసు—(తనలో) ఒక్కనొసలే కాదు ముఖ మంతయు ముత్తవనే పోలియున్నది.

సున—ఓ వసుకామా! వినుము భానుమతి యెంతసుందరురాలో యంత విధేయురాలుగా కూడ నయినపక్షమున, దానిది పయియలంకారములచేత తాత్కాలికముగా వచ్చిన యందముగాక స్థిరమయిన స్వాభావిక సౌందర్య మని నీకే యనుభవము కాఁగలదు.

వసు—అట్లే యనుభవ మగును. ఆమెప్రాయము పదియాఱు సంవత్సరములే యయినపక్షమున, ఆమె తనకంటె రెట్టింపువయస్సు దాని ముఖసౌందర్యమును పొంది యున్నదని నాకిప్పుడే యనుభవ మగుచున్నది.

సుద—ఏమీ? వసుకామా! నీవు భానుమతిని పరిహాసము చేయుచున్నావా యేమి?

వసు—పరిహాసము కాదు. సత్యమే పలుకుచున్నాను. నిజముగా నీవు నీకొమార్తె సౌందర్యవతియనియే తలఁచుచున్నావా?

సుద—నాకన్నులతో చూచినయెడల, దానికంటె సౌందర్యవతి యీ యుజ్జయినీనగరములో నుండదు.

వసు—నేను నాకన్నులతోఁ జూచినాను నేను వీధులలోఁ

జూచెదు సామాన్యస్త్రీలకంటె నాకామెయందు వాధిక్య మేమియుఁ గనఁబడ లేదు.

సుద—అట్లయిన నీవు గుడ్డివాఁడవు.

వసు—కాదు, నీవు తప్పక పుత్రికాపక్షపాతివి.

సుద—ఏమిరా! నాకు యుక్తాయుక్తవివేకమే లేదా? మేలిమి బంగారువంటిశరీరమును, కలువలనుమించిన కన్నులను, చంద్ర బింబమువంటి ముద్దుమొగమును, మల్లెమొగ్గలవంటి పలువరుసయు, కిన్నరవంటి మృదుమధురస్వరమును, సౌందర్యము కాకపోయిన యెడల మఱి యేది సౌందర్య మగునో నాకు తెలియకున్నది.

వసు—ఔరా! బిడ్డను తండ్రి యెటువంటికన్నులతోఁ జూచు చున్నాఁడు! ఆమెయందు నీవిప్పు వర్ణించినలక్షణము లన్నియు విపరీతములుగా నున్నవి. ఆమె శరీరమూర్ధవముకంబళిగుడ్డవలెనున్నది ఆమె నేత్రముల యందమెల్లను మెల్లకన్నులు కాకపోవుటయే; ఆమె దంతములు మల్లెమొగ్గలవలె లేకపోయినను పీకెమెట్లవలె నెగుడు దిగుడుగా నున్నవి; ఇఁక నా మెతియ్యని కిన్నరస్వరమో బొంగుపోయి సిల్లలూదెకుబూరను మించి యున్నది.

సుద—ఓరిచండాలుఁడా! నీవిక్కడ నన్నవమానపఱుప వచ్చినావురా? తత్క్షణము మాయిల్లు విడిచి లేచిపో.

విజ—(వెలుపలనుండి వచ్చి) బాబయ్యగారూ! ఈవివాద మెందుకు?

సుద—విన్నావా? ఈపాషండుఁడు సిగ్గు లేక నీ చెల్లెలు చక్క నిది కాదనుచున్నాఁడు.

విజ—ఇతఁడు గుడ్డివాఁడయినను కావలెను; లేదా తలక్రొవ్వి నమదోన్మత్తుఁడయినను కావలెను.

వసు—(తనలో) నామీఁద వీ రిద్దఱు నేర మగుచున్నారు. ఈవిషయములో నే నతిదూరము పోయినాను.

విజ—ఇందులో తప్పక యేదో పొరపా టున్నది. ఇతఁడు చూచిన దొక వేళ నాచెల్లెలు కాదేమో?

సుద—ఇతనివలెనే నీవును పెద్దమతిమాలినవాఁడ వగుచున్నావు. ఇక్కడ భ్రమ కవకాశ మేమున్నది? భానుమతిని గదిలో పెట్టి తాళము వేసి తాళముచెవి నాయొద్ద నుంచుకోలేదా? మనపరిచారిక తీసికొనిపోయి యితనిని నీచెల్లెలిగదిలో విడిచి రాలేదా? ఇందులో పొరపా టేమున్నది? లేశమును లేదు. ఈపాషండుఁడు బుద్ధిపూర్వకముగానే నన్ను పరాభవపఱుపఁ దలఁచుకొన్నాఁడు. మన గృహమున కతిథియై పోయినాఁడు కాని లేనియెడల నన్నిట్లవమాన పఱిచినందుకు నాముసలికత్తె యీపాటి యితనిని యమగృహమున కతిథిని జేసియుండును.

వసు—(తనలో) ఈగొడవలోనుండి నే నేలాగున నైనను బయలఁబడవలెను. భానుమతి చక్కనిది కాకపోయినను, భానుమతి తెచ్చెడియరణము మిక్కిలి చక్కనిది. అరణము పోనియ్యకూడదు. (ప్రకాశముగా) అయ్యా! నిన్ను పరిభవపఱచవలెనని నాయుద్దేశ మెంతమాత్రమును కాదు. నాప్రియురాలిమీఁద నాకెంతో ప్రేమ యున్నది. మేలు కలిగినను కీడు కలిగినను తప్పక మీకొమార్తెను వశపఱుచుకొని వివాహమాడవలెననియే నానిరంతరప్రార్థన. నేను పరిహాసము చేయలేదని ప్రమాణముచేసి చెప్పఁగలను.

సుద—ఛీ ఛీ! అతిప్రసంగముచేసి నాకు మఱింతకోపము తెప్పించకు. నీవాలకము చూచిన నాదేహము మండుచున్నది.

వసు—బావా! ఈమన కాగ్రహము హెచ్చగుచున్నది.

ఈయనను గట్టిగా పట్టుకొమ్ము. అయ్యో! మీరు కోపావేశవివశు లయి యున్నారు. నేనిక్కడనుండి పాఱిపోవలెను.

సుద—నీవు దొంగవు. వట్టిపనికిమాలినవాఁడవు. ఇక్కడ నుండి లేచి పో.

వసు—మామా! రమ్ము. ఇఁక పరియాచకము చాలించి మనము కార్యాంశమును మాటాడుకొందము.

సుద—ఏమీ!

వసు—అహాహాహా! నేను నవ్వులాటకు మీఁకొమార్తెను చేసినయీదూషణ మీరు నిజముచేసి తప్పుపట్టినయెడల, నేను చెడిన వాఁడనేకదా!

సుద—నీయుద్దేశ మది కాదా?

వసు—ఎంతమాత్రమును కాదు. మీకెంతకోపము వచ్చునో చూడవలెనని యీయెగతాళిమాట లన్నాను.

సుద—సరిసరి. అంతేకదా! నీవు పరిహాసకుఁడవుకూడ నని నేనీవఱ కెఱుఁగనే యెఱుఁగను. అహాహాహాహా! దైవముతోడు! నీ వన్నమాటలకు నా దేహము తెలియనంతకోపము వచ్చినది. ఇప్పుడు భానుమతి నీమనసువచ్చిన చక్కనియొయ్యారియేకదా?

వసు—చక్కనిదా యని నేఁజెప్పవలెనా? రంభ నీకొమార్తె కాలికి దాస్యము చేయుటకు పనికిరాదు.

సుద—ఓ జిత్తులమారి పెండ్లికొడుకా! దగ్గఱగా వచ్చి నా కొక్కసారి నీ కౌఁగిలి యిమ్ము. ఈవిఘ్నమువల్ల కార్యము భగ్న మయిన దనుకొన్నాను. కాలేదు.

విజ—(తనలో) ఈకలహము ముదిరి కార్యవిఘాత మగునని

నే నెంతో యాశ పడినాను. ఈమాయలమారి పాషండుఁడు నా కాశాభంగము కలుఁగఁజేసినాఁడు.

సుధ—కోపవేగముచేత నాలుక తడియెండిపోయినది. లోపలికిఁ బోయి దాహశాంతి చేసికోవలెను. భానుమతీ! నీవందగత్తెవు కావఁట? అహహహహా! ఇది మంచి పరిహాసము.

వసు—(తనలో) ఇదిపరిహాసమే కాదు సత్యమే.

సుధ—ఓవిజయవర్మా! నీ కాఁబోవుబావకు విజయము కోరుము.

విజ—ఓ కాఁబోవుబావా! నీకు నేఁ డవాంఛితార్థసిద్ధి యగునుగాక!

సుధ—ఓ యభినవబృహస్పతీ! మనకు భోజనవేళ యయినది. నామనస్సులో నీమీఁది కోపమేమయిన దిగబడినయెడల, ఆప్యాయనముగా భోజనముచేయఁగానే యడుగునఁ బడిపోవును. పోదము లెమ్ము.

గీ. సరససల్లాపములకన్న శాంతవచన
సముదయముకన్నఁ గడువేగఁ జల్లపఱుచుఁ
బుష్టికరమైన యిష్టాన్నభోజనంబు
కాఁకనొందిన మనసును గడియలోన.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

౪. రంగము—వసుకాముని గృహము.

[భానుమతి ప్రవేశించు చున్నది.]

భాను—తండ్రియింటనుండి పాఱిపోయివచ్చి మనస్స్వస్థత లేక నావలె పరితపించు కొమార్తె లోకములో మఱియెవ్వతె యైన నుండునా? నాకు భర్త కాఁగోరియున్న వానిచేతనే నేనిప్పుడు నాప్రియుని వెదకించుచున్నాను. నాతండ్రి మెచ్చినవరుఁడు నేను మెచ్చినవరుని దెచ్చుటకయి పోయినాఁడు. ఆహా! ఇష్టులరాకను కోరినిరీక్షించుచున్న కాలము దుస్సహమయి మనము నెంతవ్యాకుల పెట్టుచుండును!

ద్విపద. కాలమా! ఱెక్కలు గట్టుకొంచీవు
హేలాగతిని నిల్వ కెగసెద వంచు
నేకవి నినుఁ దొల్త నిలను వర్ణించె
నో కాని యాతఁ డీయుర్విలోఁ దాను
బ్రియురాలి నెన్నఁడు నెడఁబాయనట్టి
వయసువాఁ డయియుండవచ్చు సత్యముగ
దినమొక్కటేనియుఁ దిన్నఁగాఁదాను
జెనుపొందువలపుతోఁ బ్రియురాలిఁ బాసి
విరహాగ్ని వేఁగినవెంగలి యెవఁడు
పరుగెత్తుదు వటంచుఁ బలుకును నిన్ను?

[అప్పుడు చంద్రకేతుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

భాను—అన్నా! కామపాలుఁడు దొరికినాఁడా?

చంద్ర—సోదరీ! నా కతఁ డెక్కడను కనఁబడలేదు. నా

మిత్రుఁడయిన వసుకాముఁ డిప్పు డాతని నేలాగునైన పట్టుకొని యిక్కడకు తీసికొని రాకమానఁడు.

భాను—ఎంతసిగ్గుపాటు! అతనిజాడ తీయుట కయి నీవు నీ చెలుకుదన ముపయోగింపలేదా? నీప్రాపు నమ్ముకొనియున్న యీ సహోదరికి చూపవలసిన యుపచార మదేకద?

చంద్ర—ఓ సోదరీ! నీపనిలో నే నశ్రద్ధ యెంతమాత్రమును చేయలేదు.

భాను—కామార్త యయి ప్రియుని రాక వేచియున్న నాయకి మనస్సునకు జాగు చేసిన యొక్కొక్క నిమిష మొక్కొక్క యుగముగా తోఁచి యెంతదుర్భరముగా నుండునో మీయిద్దఱిలో నెవ్వరికైన తెలిసియుండినపక్షమున మీరిట్లు కాలహరణము చేసియుండరు.

చంద్ర—అయ్యో! నాకాయవస్థ పూర్ణముగా తెలిసినదే.

భాను—అట్లయిన, నీ వొకసుందరిని కామించియుంటివి కాఁబోలును.

చంద్ర—ఓసోదరీ! పూర్వ మొకసారి నేనును శృంగారనాయకుఁడ నయి తిరిగిన వాఁడనే. ముందెప్పుడును స్త్రీపేరు తలపెట్టకుండ నా కాయొక్కసారితోనే బుద్ధి వచ్చినది.

భాను—నీప్రియురా లంత నిర్దయురాలుగా నుండినదా?

చంద్ర—ఆమె యెల్లప్పుడును దయావిహీనురాలుగానే యుండినయెడల నేను సుఖినే యయి యుందును.

సీ. నాప్రియురా లెప్డు నామీఁదఁ జెలువవ్వ
పొలయింపకున్న నేఁ బాగుల నింత
కృశియింప వలదంచు, నిదె వరించెద నంచు,
నగమాలు కామాగ్ని రగులు కొలిపి

యెంతనిర్దయురాలో యెఱుఁగు మావల నింతి
తాను పెంచినయాశ తఱిగివేసె
నటునిటు గాలికి నల్లలనాడెడు
పగిలిపోయినయోడపయిని నిలిచి
దాని విడనాడి క్రిందిసంద్రంబులోన
పడఁగ నుంకించి దరియంచు బదుగు శార్వఁ
బ్రాణములు వచ్చి యొడ్డు చేరకయె యోడ
మునుఁగుచున్నవాఁడును నింత వనట గనఁడు.

భాను—అడుగో నీమిత్రుఁడు కామపాలుని తీసికొని వచ్చుచున్నాఁడు. నేనొక్కనిమిష మీగదిలో దాఁగియుండి వారిని భ్రమింపఁ జేసెదను. (అని నిష్క్రమించు చున్నది)

[అప్పుడు వసుకాముఁడును కామపాలుఁడును ప్రవేశించుచున్నారు]

కామ—ఓయీ! నీవు నిశ్చయముగా పొరపడి యుందువు. నన్ను నుదంత కామించి వెదకి తెమ్మని నిన్ను పంపినదా? ఇ ట్లెంత మాత్రమును జరిగి యుండదు.

వసు—వృథావాద మెందుకు? ఇంకొక్కనిమిషములో సర్వమును నీకే తేటపడును. ఓ చంద్రకేతుఁడా! ఆమె యెక్కడనున్నది?

చంద్ర—(వ్రేలితో తలుపువంకఁ జూపుచున్నాఁడు.)

వసు—ఆగదిలోనా?

కామ—ఆమె నిజముగానే యిక్కడ నున్నపక్షమున, చిరకాలమునుండి తనమనోహరుఁడుగా నున్ననాప్రియమిత్రునియొద్దకుఁ దన్ను తీసికొనిపొమ్మని వేఁడుకొను నిమిత్తమయి నన్నిక్కడకు రప్పించి యుండును.

వసు—అందునిమిత్తము కాదని నేను దృఢముగాఁ జెప్పఁగలను. ఆమెకుఁ గావలసినవాఁడవు నీవే. నీవుతప్ప మఱి యెవ్వరును కారు. నీనిమిత్తమయి ప్రాణములు విడుచుచున్నసంపూర్ణ యౌవనవతియైనసుందరీతిలకమువద్దకు నిన్ను బోధించి పంపుటకే మా కిక్కడ శ్రమపడవలసి వచ్చుచున్నది.

కామ—న న్నెందుకు నిర్బంధపఱిచెదవు? నా కాసుందరి మీఁద ననురాగము లేదు.

వసు—భానుమతిమీఁద నున్నది కాఁబోలు! నామాట నమ్ముము. ఇప్పు డక్కడ లేశ మయినను నీయాశ కవకాశము లేదు. రెంటికిని చెడక నామాట విని నిన్ను వెదకికొనుచు వచ్చినయీభాగ్యదేవతనైనను దక్కించుకొమ్ము.

కామ—మిత్రుని కాశాభంగము కలుగఁజేయుట నాకు న్యాయమా?

వసు—రాజ్యాంగవిషయములోవలెనే కామవిషయములోను న్యాయముతో పని లేదు. వలపునిన్ను దొంగనుగాఁ జేయలేకపోయిన పక్షమున, నీవు తిన్ననివలపు కలవాఁడవు కానేకావు. రమ్ము నీవొక్కసారి లోపలికి పోయి యామెతో మాటాడియైనను రమ్ము.

కామ—అంతవఱకు చేయుటకు నా కాక్షేపణయేదియు లేదు.

వసు—(తలుపులు తీసి) అదిగో! అదిగో! ఆమె కిటికీవద్దనున్నది. లోపలికి పొమ్ము. (అని కామపాలుని లోపలికి త్రోచి తలుపు పోరగా వేసి) ఓ చంద్రకేతూ! ఇప్పుడు నే నీతనిని బోనులో త్రోసినాను. ఇఁక లోపల వీ రేమిచేయుదురో నేనిక్కడనుండి తొంగి చూచుచుండెదను. అతఁడు దిగ్భ్రమనొంది వెఱ్ఱివానివలె చూచుచున్నాఁడు—ఆమె వచ్చి బుజ్జగించుచున్నది—మిత్రుఁడా! చూడు, చూడు.

అతఁడు దారికి వచ్చుచున్నాఁడు—అవు నవును. అతఁ డిఁక తన న్యాయమును గీయమును శీఘ్రముగానే మఱచిపోవునులే.

చంద్ర—చూడు! ఇప్పుడు వారిద్దఱును నవ్వుకొనుచున్నారు.

వసు—అవు నవును. వారు నవ్వుకొనుచున్నారు. అతఁడిప్పుడు చెప్పినప్రియమిత్రుని దురదృష్టమును తలఁచుకొని నవ్వుచున్నారు కాఁబోలును. అయ్యో! పాపము వీ రతనికొంప తీసినారు.

చంద్ర—అతఁడిప్పు డామె చేయి ముద్దుపెట్టుకొనుచున్నాఁడు.

వసు—అవు నవును. వీ రిద్దఱును సమాధానపడినారు. ఇతఁడు వలలో తగులుకొన్నాఁడు; ఉరులలో చిక్కుకొన్నాఁడు. ఓ ప్రియమిత్రుఁడా! మనకృషి ఫలించినది; నాబుద్ధి పనికివచ్చినది. నేనిఁక బృహస్పతినే; అపరబృహస్పతిని.

చంద్ర—ఆవల నెవరో నీవున్నావా యని యడుగుచున్నారు. నేను పోయి చూచివచ్చెదను. (అని నిష్క్రమించుచున్నాఁడు.)

[కామపాలుఁడును, భానుమతియు ప్రవేశించుచున్నారు.]

కామ—ఓయీ! వసుకామా? సుదర్శనవర్మ గృహమునందు నీకు విజయము కలుగుట నిశ్చయ మని యీామె నాకు నమ్మకము పుట్టించినది గనుక, ఇఁక నేనక్కడ నాప్రయత్నమును పూర్ణముగా వదలుకొనెదను.

వసు—అంతకంటె తెలివిగలపని మఱియొకటి లేదు. నీమిత్రుని మోసముచేయుట నీవిప్పుడంత గొప్పగా విచారింపవలసినపని లేదు. కామవిషయములో మోసము చేయుట నింద్యార్హము కాదు? అవునా? సుందరీ!

భాను—ఎంతమాత్రమును నింద్యార్హము కాదు. నీవిట్టియభి

ప్రాయము గలవాఁడ వయినందుకు నేను ముఖ్యముగా సంతోషించు చున్నాను.

వసు—ఆమాట నిశ్చయము. చేతనయినపక్షమున నన్నెవ్వ రైనను వచ్చి యిప్పుడు మోసము చేయుదును. ఓ యదృష్టవంతురాలా! నే నిప్పుడు నిన్నాశీర్వదించెదను. మీరు వివాహము చేసికొని సుఖ మనుభవింతురు గాక యని నామనఃపూర్తిగా కోరుచున్నాను.

భాను—మీ కటువంటి కోరిక యున్నపక్షమున, మాసుఖమున కడ్డమువచ్చువారు మఱియెవ్వరును లేరు.

వసు—ఓ కామపాలా! ఇఁక మనము ప్రతిపక్షులము కాము. ఇప్పుడు మన మిద్దఱమును మిత్రుల మగుదము.

కామ—అవశ్యకముగా నగుదము.

వసు—ప్రతిపక్షి విషయమయి యింత దయ గలిగి నావలె నీలాగున శ్రమపడువాఁ డెక్కడనో యొకానొకఁ డుండును గాని యందఱు నట్టివారు కారు సుమా.

కామ—అందుకుసందేహ మేమి! అటువంటివాఁడీభరతఖండమునందు నీవొక్కఁడవుతప్ప మఱియెవ్వఁడు నుండు నని నేనునమ్మను.

వసు—మంచిది. ఆసుందరియెడల నీకుఁగల సంబంధమంతయు వదలివేసెదవు గదా?

కామ—నిశ్చయముగా వదలియే వేసినాను.

వసు—అక్కడ నీకింకను కొంచె మాశ విడువక బాధించు చున్న దేమోయని నాకు శంక కలుగుచున్నది.

కామ—నీతోడు! లేదు. ఆయాశ నేను బొత్తిగా వదలుకొన్నాను.

వసు—ఆమె ధనముమీఁది యాశ యని నాయభిప్రాయము.

కామ—నా కదియు లేదు. ఆమె కున్నది సర్వమును నీవు యథేచ్ఛముగా పుచ్చుకోవచ్చును.

వసు—ఈ బేరములో నీకేలాభమున్నది. అక్కడ కొంచెము ధననష్టము కలిగినను నీకిక్కడ ధనమున కిరువదిరెట్లెక్కువ సౌందర్యలాభము దొరకినది. ఓసుందరీ ! ఇప్పుడు నీకొక్క రహస్యము చెప్పెదను. నే నీ సాయంకాలము లోపలనే భానుమతి నెత్తుకొని వత్తును సుమా !

భాను—ఆలాగుననా?

వసు—అవును. తండ్రిచేతిమీఁదుగా తాను భర్తను గ్రహింపనని యామె యొట్టు పెట్టుకొన్నది. ఆమెతోఁ గలిసి నన్నుద్యానవనములో సంచారము చేయనిచ్చుటకు తండ్రి నొడంబఱిచి తాళము చెవి తెచ్చినాను. అక్కడనుండియే మే మిద్దఱమును ముసలివాని కన్నులు కప్పి మెల్లగా తప్పించుకొని జాఱఁ దలఁచుకొన్నాము.

భాను—సుదర్శనవర్మ కీసంగతి తెలియనే తెలియనియ్యరా?

వసు—ఎంతమాత్రము తెలియనియ్యము. మా మెలఁకువయంతయు నిందులోనే యున్నది. ఈ యుపాయముచేత నే నతని నెట్లు మోసము చేయుచున్నానో నా చమత్కారము కనిపెట్టినావా? ఓలి యొక్క చిల్లిగవ్వయు నియ్యనక్కఱలేకుండ నే నా ముద్దరాలి ధనమంతయు దక్కించుకొనుచున్నాను. నామంత్రాంగశక్తి యిప్పుడు నీకు స్పష్టమయినదిగదా? నావద్ద నింద్రజాల మహేంద్రజాలము లున్నవి.

కామ—అహహహా ! నీవెక్కడ ? మఱుమాయలమారివి. మాయలయందు నీ వాశంబరాసురుని చంపి పుట్టినావు.

వసు—ఒకవేళ నీ విది మోసమందువేమో! అందు నైనను నా తెలివికి మెచ్చుకొన్నావా? నేను శంబరాదులను మించిన మోసగాఁడను.

కామ—నీ వెంతవాఁడ వయిన నగుదువు. నీ వఖండ ప్రజ్ఞావంతుఁడవు.

వసు—నిజము తెలిసినతరువాత సుదర్శనవర్మ యింటివద్ద కడుపు లుబ్బ నవ్వుటకు మన కెంత వినోదమయినను కలుగును.

భాను—కావలసినంతవినోదము కలుగు నని నేను వ్రాసి యియ్యఁగలను. నిజము వెల్లడి యయినప్పుడు మాకు పట్టరాని సంతోషము కలుగును. అహహాహా!

[అప్పుడు చంద్రకేతుఁడు మరల ప్రవేశించుచున్నాఁడు.]

చంద్ర—ఓవసుకామా! భానుమతి వేడుకనిమిత్త మయి నీవు పాడింపఁ దలఁచుకొన్న వీణెపాటకులు వచ్చి వాకిట నిలిచి యున్నారు.

వసు—వారిపని యిప్పుడు లేదు. ఆపాటకులకు నేను కొంచెము సొమ్మియ్యవలసి యున్నది గనుక వారిని తీసికొనిపోయి నేను సమాధానపఱిచి వచ్చెదను. నన్ను క్షమించెదరా?

భాను—అవశ్యకముగా పోయి రావచ్చును.

వసు—నామిత్రుఁడు మీయొద్ద నుండును. మీరితనిచేత కావలసినపని చేయించుకోవచ్చును. ఓ సోదరీ! నీకు నేను పరమ విధేయుఁడను. ఓ కామపాలా! మీరు సుఖు లయి యుందురుగాక! (తనలో) ఈకామపాలుఁ డమాయకుఁ డయిన బుద్ధిహీనుఁడు. ఇతనిని నాచేతిలో తోలుబొమ్మ నాడించిన ట్లాడించుచున్నాను. నేను దివ్య మయినపని చేసినాను. (అని నిష్క్రమించుచున్నాఁడు.)

భాను—ఓ చంద్రకేతూ! నీవు మరల నాకు మార్గదర్శివయి కారాగారమునకు నన్నుఁ గొనిపోయి విడిచి వచ్చెదవా?

కామ—ఓప్రియురాలా! నీ వక్కడ కేలపోవలెను?

భాను—దానికి వేఱే కారణమున్నది. నీవు నావెంట వచ్చుచుండఁగా మన లెవ్వరును జూడఁగూడదు. అక్కడినుండి నేను మాతండ్రి కొక లేఖ వ్రాసెదను. ఏకారణముచేత నే నిల్లువిడిచి రావలసివచ్చినదో వివరపఱిచినపక్షమున, ఆతనిమన సొకవేళ కరఁగ వచ్చును.

కామ—సాకారయాశ లేశమును లేదు. ఓ హృదయేశ్వరీ! ఇఁక నీవొక్క యీబాహువులనే శరణము చేసికోవలెను.

భాను—తాళిమివహించి కొంచెముసేపోర్చుకొని యుండుము. అక్కడినుండి నాతండ్రి నన్ను బలవంతముగా తీసికొని పోలేఁడు. కొంత ప్రొద్దుండఁగానే నీ వక్కడకువచ్చి నన్ను కలిసికొమ్ము. నీ కప్పుడు సమస్తమును తెలుపుడు చేసెదను.

కామ—నీవు చెప్పినట్లు చేసెదను.

భాను—మిత్రుఁడా! రమ్ము. ఓ కామపాలా! ఈచంద్రకేతుఁడును నీవలెనే పూర్వ మొకసారి కాముకుఁడయి యున్నవాఁడే సుమా.

కామ—అట్లయినపక్షమున మనమీతనియందుంచినవిశ్వాస గౌరవ మితనికి చక్కగా తెలియును.

చంద్ర—నే నెప్పుడును మీయెడల విశ్వాసఘాతుకుఁడ కాఁబోను.

సీ. చిత్తజుఁ డొకసారి చిత్తంబులోపల
నతిథియై మన్నన లంది యుండి

యేగినపిమ్మట నెదలోన నెప్పుడుఁ
గామార్తునెడ జాలి కదలకుండు
యాత్రాపరాయణులైన మహాత్ములు
తాము వసించిన తావులెల్లఁ
బావనంబులు చేయుపగిదిని గాముండు
నొకసారి మున్ను తా నుండినట్టి
స్వాంతములనెల్లఁ బరిశుద్ధ పఱిచివైచి
వెనుకఁ దనచిహ్నముగాఁగ విడిచిపోవు
స్థిరముగా నాత్మలోఁ గనికరము కరము
తన్ను మఱచిపోయిన యనంతరము కూడ.

(అందఱును నిష్క్రమించుచున్నారు.)

తృతీయాంకము

౧. రంగము—సుదర్శనవర్మ గృహములోని పుస్తకనిలయము.

[సుదర్శనవర్మయు సేవకుఁడును ప్రవేశించుచున్నారు.]

సుద—నేను పుట్టి బుద్ధి యెఱిఁగినతరువాత నా కిటువంటి యద్భుత మెప్పుడును కలుగలేదు. ఏమీ యీవింత. భానుమతియే వసుకాముని తీసికొని లేచిపోయినదిగా! నేను వివాహము చేయఁ దలఁచుకొన్న పురుషునితోనే దొంగతనముగా పాఱిపోయినదా! తన భర్తనే తగులుకొని పోయినదా! ఇట్లు జరగియుండదు.

సేవ—మీరు వీధిలోనికి వెళ్ళఁబోవునప్పుడు వారుద్యానవనములో తిరుగుటకు మీవద్ద సెలవు పొందినారని యామె పరిచారిక చెప్పుచున్నది. మేము పోయి చూచునప్పటికి పూలతోఁటలోనిలతా

గృహముతలుపు తీయఁబడి యున్నది; అప్పటినుండియు వారిజాడ యెక్కడను తెలియరాలేదు.

సుద—సరే. నాకిదియేమో మాయగా నున్నది. ఏమి నిర్ణయించుటకును వీలు కనఁబడదు. ఇందులో నాకు తెలిసికో శక్యము కాని పిశాచప్రేరణ యేదో యున్నది.

[మఱియొక సేవకుఁడు లేఖపట్టుకొని ప్రవేశించుచున్నాఁడు.]

సేవ—ఇదిగో మీకు వసుకాముని యొద్దనుండి కమ్మ వచ్చినది.

(అని నిష్క్రమించుచున్నాఁడు)

సుద—ఇప్పుడీ లేఖవల్ల నిజము తేటపడవచ్చును. ఓ వసుకామా! నీవెంతటి వాఁడవురా! ఇందులో నే మున్నదో చదివి చూతము. (అని చదువుచున్నాఁడు.)

"ఆర్యోత్తమా! నేను నీ కొమార్తెను తీసికొని పాఱిపోవుట మీకత్యాశ్చర్యకరముగా నుండును."—సందేహము లేదు. ఇది నిశ్చయముగా వీనిపనియే. నాకాశ్చర్యముగానే యున్నది.—"మా ప్రథమ సందర్శన సమయమునందే నే నామె హృదయమును నా వశము చేసికొన్నాను."—ఓరి రాక్షసుఁడా! నీవశము చేసికొన్నావు-"మందభాగ్యముచేత మీ చేతిమీఁదుగా తాను భర్తను పొందనని యామె ఘోరప్రమాణము చేసికొన్నందున, నే నామె పిచ్చకోరికను చెల్లింపవలసి వచ్చినది"—ఆలాగునా? ఆలాగునా!—"మేము శీఘ్రముగానే వచ్చి మీ పాదములమీఁద పడఁబోవుచున్నాము; ఈ యవివేక కార్యమును మనసులో పెట్టుకోక మీ రల్లుని నాశీర్వదింప సంసిద్ధులయి, యుందురని నమ్ముచున్నాను.

ఇట్లువిన్నవించు మీ విధేయ సేవకుఁడు,

వసుకాముఁడు,"

ఇది యెంతపిచ్చి యాలోచన! ఆసమయమునందు నాకోమా
ర్తెనేదో పిశాచ మావహించి యుండి యిట్లు చేయించి యుండును.
ఈప్రాతఃకాలము వఱకును ప్రాణము పోయినను తా నాతనిని వివా
హము చేసికొననుచుండినది! అప్పుడే సాయంకాల మయినను కాక
మునుపే యతనితోనే పాఱిపోయినది! పోనిమ్ము. వారియుద్దేశ
మెట్టిదయినను జరగవలసినది నాయిష్టమే జరిగినది. ఇంక తక్కిన
విషయములలో వసుకాముఁడు మాయొడంబడిన ప్రకారమే నడుచు
కొనునని నమ్మెదను.

[సేవకుఁ డొకలేఖ పట్టుకొని మరల ప్రవేశించుచున్నాఁడు]

సేవ—ఈకమ్మ మీకోమార్తె యైనభానుమతి మీకిమ్మని
పంపిన దని యెవ్వఁడో తెచ్చినాఁడు. (అనిచేతికిచ్చి పోవుచున్నాఁడు)

సుద—(పుచ్చుకొని) ఏమీ! ఈవ్రాఁత నేనెఱుఁగుదును.
ఇది నాకూఁతురు వ్రాసినదే. ఇద్దఱును వేఱువేఱుగా జాబులు
వ్రాయవలసిన పనిలేదే! అయినను భానుమతి యేమి చెప్పనో
చూతము. (అని చదువు చున్నాఁడు)

"ఓ ప్రియజనకుఁడా! నే నవివేకినినయి యింతసాహస కార్య
ము చేసి యిప్పుడు నిన్నెట్లు క్షమింప వేఁడుకోఁగలను? ఈయుద్దేశ
ముతో పాఱిపోతినని నే నేనోరు పెట్టుకొని చెప్పఁగలను?"—ఇంతే
కద? ఆయుద్దేశమేమో యిప్పుడు వసుకాముఁడు చెప్పనేచెప్పినాఁడు.
ఈలేఖలు వ్రాసినప్పుడు వారిద్దఱు నొక్కచోట లేరనుకొనెదను—
"నిరాదరము కలిగినప్పుడు నాహృదయ మెంత యాగ్రహపరవశ
మగునో, సదాదరము కలిగినప్పు డంత దయార్ద్ర మగునని మీకు
విశద మయియే యున్నది"—సరిసరి! ఇప్పుడు గుట్టంతయు బయలికి
వచ్చుచున్నది. కామపాలుఁ డనాదరము చేయుఁగా వసుకాముఁడు

చేసినయాదరమునుబట్టి దానికతనియందు దయపుట్టినది. అవునవును. ఇప్పటి కంతయు స్పష్ట మయినది. ఆపయిని—"నన్ను దేవతనుగా భావించి పూజించెడు నామనోహరుఁడే నాకుభర్త కాఁబోవుచున్నను, నే నింకను వివాహము చేసికొలేదు"—అవు నవును. వసుకామునికి భానుమతి పంచప్రాణములలో నొకప్రాణము.—"ఇప్పుడుమీయంగీకారమును పొందునంతటిభాగ్యము నాకు పట్టినయెడల, నేను సంపూర్ణసుఖవంతురాల నగుదు నన్ననమ్మకముతో ప్రతిక్షణమును మీ ప్రత్యుత్తరమున కెదురుచూచుచుండు

మీప్రియపుత్రిక—భానుమతి"

నాయంగీకారము కావలెనా? నిశ్చయముగా నీవివాహమునకు నే నంగీకరించెదను. నాకింతకంటె సంతోషము మఱి యెప్పుడును గలుగదు. నేను వెంటనే నాయనుమతి తెలుపవలెను. మూర్ఖపుపట్టు పట్టుట యెప్పుడును మంచిది కాదు. ఓరీ! దారకా!

సేవ—(ప్రవేశించి) అయ్యా! ఏమిసెలవు?

సుద—ఈరెండవలేఖ తెచ్చినవాని నుండుమని, మొదటి వానితో మంచిది పొమ్మన్నానని చెప్పు. నీవు లోపలికిఁబోయి కాగితమును కలమును సిరాబుడ్డియు తీసికొని రా.

సేవ—చిత్తము (అని నిష్క్రమించుచున్నాఁడు)

సుద—పాపము! ఉయ్యాలవలె కొట్టుకొనుచుండుభానుమతీ మన స్సెప్పుడు శాంతిపఱుతునా యని నాకత్యాతురముగా నున్నది. ఓరీ! దారకా! ఓఘటకా! (అని పిలుచుచున్నాఁడు)

[ఇద్దఱు సేవకులు ప్రవేశించుచున్నారు]

సుద—ఈరాత్రి బంధువుల కందఱకును మనయింట విందు గనుక, పిండివంటలతో వంట కావలెనని లోపలికిపోయి చెప్పు.

వంటలవారిని వేగిరము పిలిపించుమను. మంచికూరలు చేయించవలెను. సంగీతముపాడుటకయి పాటకులకు వర్తమానము పంపు. తిన్నఁగా విన్నారా?

సేవ—చిత్తము. విన్నాము.

సుద—ఈరాత్రి యెవ్వరు వచ్చినను మనయింట భోజనమునకడ్డంకి యుండఁగూడదు.

సేవ—(నిష్క్రమించుచున్నారు.)

సుద—ఈరాత్రి వేడుకకు విలువలేకుండఁ జేయవలెను. ఈరాత్రి నాచర్యచేత ముసలివాఁడుకూడ వేడుకసమయమునం దెంత యుత్సాహముతో నుండఁగలఁడో యందఱికిని తెలియునట్టుచేసెదను.

ద్విపద. పగ లెల్ల సరసంపుఁబలుకులఁ గడపి
తెగువమై రాత్రులు తిని త్రాగి త్రుళ్ళి
కలుములఁ దులఁదూఁగి కష్టము ల్లేక
యెలఁబ్రాయమునఁ దొల్లి యేనున్నయప్పుడు
వ్యసనమ్ము పేరైన నాలించి యెఱుఁగ;
నిసుమంత యున్న నాయీడె పోఁద్రోలు;
మిగిలి యింకనునున్న మృష్టాన్నభుక్తి
యెగమీఁటు నద్దాని నించుకలోన.
తుద కిప్పు డింత నాదోశ్శక్తి తగ్గి
ముదిమి పైకొని నన్ను మోసంబుచేసె;
తలవెంట్రుకలు కొన్ని తలపైని నిలచె;
నిలిచిన కొన్నియు నెఱసి పీచయ్యె;
వసుధ సుదర్శనవర్మ కట్లయిన,
నిసుమంత యుత్సాహమేనియుఁ బోదు;

వయసు చచ్చినఁగాని వడి యించుకంత
యయినను జావలే దది నిశ్చయంబు.

(అందఱు నిష్క్రమించు చున్నారు.)

---

౨ రంగము—వీధిలో వినోదమంటపము.

[విజయవర్మయు దామోదరుఁడును ప్రవేశించుచున్నారు.]

విజ—ఏమి! నీవింతమాత్ర మామెజాడ తీయలేక పోయి నావుగదా! ఆమె యెక్కడకు పోయియుండునో నీ వూహా మైనను చేయలేవు. ఓ సుదంతా! ఓ సుదంతా!

దామో—నా కామెజాడ యెంతమాత్రమును తెలిసినది కాదు. ఆమె తండ్రియొద్దనుండి పాఱిపోయినదని మాత్ర మెక్కడఁ జూచినను గుంపులకూడి చెప్పుకొనుచున్నారు. మాధవసేనుఁడామెను వెదకి పట్టుకోవలె నని బయలుదేఱినాఁ డన్న మాటకూడ నందఱి నోళ్ళలో నున్నది. ఆమె యెక్కడకు పోయినదో యేమయినదో మాత్ర మెవ్వరును జెప్పలేరు.

విజ—ఓ తెలివిమాలిన మొద్దా! నీమాటలకు నాకు కోపము వచ్చుచున్నది; ఆమె యీ యుజ్జయినీనగరము దాఁటి యెక్కడకును పోయి యుండదు.

దామో—నేనును నాలో నాలాగుననే యనుకొన్నాను. ఉజ్జయినీనగరము త్యజించి పోలే దని నాకును తెలియును. తెలిసిన నేమిప్రయోజనము! కొంద ఱామె, కామవేదనచేత చచ్చిపోవుచున్న దన్నారు; మఱికొంద ఱామెను కామపాలుఁ డెత్తుకొని పోయినాఁ డన్నారు.

విజ—ఓ పశువా! ఇది కేవలము నీకల్పన ఆమాట యెవ్వరు ననలేదు.

దామో—అట్లయిన పక్షమున వారిమాట నేనే పొరపాటుగా గ్రహించినాను కాఁబోలును!

విజ—పో. ఓ బుద్ధిహీనుఁడా! ఇంటికి పో. ఆమె సమాచారము తీసికొని వచ్చువఱకును నీవుమరల నాకు మొగముచూపఁబోకు.

దామో—మంచిది. (అని నిష్క్రమించుచున్నాఁడు)

విజ—ఓహో! కృతఘ్నురా లయిన యామెయందుఁ గల మోహముచేత నామన స్సెంత చెడిపోయినది!

[అప్పుడు వసుకాముఁడు ప్రవేశించుచున్నాఁడు]

వసు—ఆమెను సురక్షితమైనచోటనుంచి వచ్చినాను. ఇఁకను వివాహము చేయించుటకొక్క పురోహితుని మాత్రము సంపాదించుకోవలెను. కామపాలుఁ డిఁక సుదంతను వివాహము చేసికొన్నను సరే, చేసికోకపోయినను సరే.

విజ—వసుకామా! నీవిప్పుడు సుదంతనుగూర్చియున్న దేమో!

వసు—ఓ విజయవర్మా! బావా! ఇక్కడ నీవు నా కలభ్యయోగముగా తటస్థించినావు!

విజ—ముందు సుదంతసంగతి చెప్పు.

వసు—సుదంతసంగతి కావలెనా? చెప్పెద వినుము. నేఁటి యుదయకాలమున నేనుమీయింటికి వచ్చుచుండఁగా నాకొకసుందరి యెదురుపడి తనపేరు సుదంత యనిచెప్పి నన్ను శరణు వేఁడినది.

విజ—ఏమని?

వసు—ఉజ్జయినీనగరమునందున్న యొక పడుచువానిమీఁది వలపుచేత తనతండ్రియింటినుండి లేచివచ్చినానని చెప్పినది,

విజ—ఓ యీశ్వరా! ఆసంగతి యామె యొప్పుకొన్నదా!

వసు—స్పష్టముగా నొప్పుకొన్నది. తానుపాఱిపోయి వచ్చు సంగతి తనప్రియునకు తెలియఁజేయలేదనియు, తనకట్టియుద్దేశమున్నట్టయినను తనప్రియునకు తెలియదనియు కూడ చెప్పినది.

విజ—(తనలో) ఆమాట సత్యము. ఓప్రియురాలా! ఈ సంగతి యొక్కటియు నాకు నిజముగానే తెలియదుసుమా. ఓహో! నే నదృష్టవంతుఁడను. (ప్రకాశముగా) వసు కామా! అటుతరువాత—

వసు—అటుతరువాత తనప్రియుని వెదకి కనుఁగొని తన్నాతని యొద్దకుఁ గొనిపొమ్మని నన్ను బతిమాలుకొన్నది.

విజ—ఓయీశ్వరా! ఏమిభాగ్యము! అట్టయిన మనమిప్పుడు పోదము రా. ఇఁక నొక్కనిమిషమైనను నీవాలస్యము చేయఁగూడదు. (అని యతనిని లాగుచున్నాఁడు)

వసు—ఆగు. మన మిప్పు డెక్కడకు పోదము?

విజ—ఏమి? అటుతరువాత మఱి యేమైనజరిగినదా?

వసు—జరిగినది. ఆమెదీనాలాపములచేత నామనసు కరఁగినే నామెప్రార్థన చెల్లించినాను.

విజ—మంచిది. ఇప్పు డామె యెక్కడ నున్నది?

వసు—ఎక్కడ నున్నదా? ఆమెను సురక్షితముగా ప్రియుని చేతులలో నప్పగించి వచ్చి యామెప్రార్థన చెల్లించినానని నేను నీకిప్పుడు చెప్పలేదా?

విజ—నాకు చావుగా నున్నది. నీ వూరక కాలహరణము చేయుచున్నావు. తరువాత నా కామె కనఁబడనేలేదు.

వసు—అవును కనఁబడలేదు. ఆమె నీకేలాగున కనఁబడును?

ఆమె కామపాలునినే కోరినది; నేనామెను కామపాలునికే యొప్పగించినాను.

విజ—(తనలో) అయ్యో! నేను చెడినాను. నామతి పోవుచున్నది. (ప్రకాశముగా) కామపాలుఁడా? ఏకామపాలుఁడు? విపణివీధినుండు కామపాలుఁడా?

వసు—అవును. ఆకామపాలుఁడే. ఇందులో మఱియొక చమత్కార మున్నది. అతఁడామెను స్వీకరించుట కొకప్పటున మొట్టమొదట నొప్పుకోలేదు. తనప్రియమిత్రుని మోసము చేయఁగూడదనియు, న్యాయము కాదనియు, మనసొప్పదనియు, అతఁడు బహుదూరము నీతులు చెప్పినాఁడు. కాని మేమాశంకల కన్నిటికిని పరిహారములు చెప్పి మెడలు విఱిచి తుదకతనిని సమాధానపఱిచినాము.

విజ—ఇంతపని మీరే చేసినారా?

వసు—నిస్సందేహముగా మేమేచేసినాము. అతఁడుమోసము కూడ దన్నాఁడు. ఆమె కామవిషయములో మోసము తప్పు కాదన్నది. అతఁడు తనప్రియమిత్రుఁ డన్నాఁడు; నేనాప్రియమిత్రుని తుంగలో నూరఁద్రొక్కు మన్నాను. పాపము! తుద కతఁడు విధిలేక యొప్పుకొన్నాఁడు. ఇష్ట మున్నయెడల నీక నాతనిని తనన్యాయము నిమిత్తమయి యురి పెట్టుకొని చావు మను.

విజ—(తనలో) ఇఁక నేనిక్కడనుండిపోవలెను. పోనియెడల నాగుట్టు బయలఁబడిపోవును. (అని పోవు చున్నాఁడు.)

వసు—విజయవర్మా! నిమిషము నిలువుము. ఇందులో నున్న చమత్కారము నీవు కడవఱకును విననేలేదు.

విజ—నీచమత్కారము తీసికొనిపోయి పాతిపెట్టు.

వసు—ఓహోహో! నీకు నిష్కారణముగా కోపము వచ్చుచున్నది. నేను నీకు కావలసినంతవినోదము కలిగించుచున్నా ననుకొనుచున్నానే.

విజ—వినోదము కాదు. వేదన కలిగించుచున్నావు.

వసు—ఆ మోసపోయిననిర్భాగ్యనాయకుఁడవు నీవు కావుగదా? నీవే యయినట్టున్నావు. అవునవును. సందేహము లేదు నీవే. ఇది యిప్పుడు నేను చెప్పెడుదానికంటెను మంచివినోదము. ఆహాహాహా!

విజ—ఓరిపాపిష్ఠుఁడా! పరమచండాలుఁడా! ఏమీ! నన్ను చూచి నవ్వుచున్నావా? (అని మెడ పట్టుకొని) నీవంటి యధముని మీఁద కోపము చూపుట నాకే గౌరవహానికాని, లేకపోయినయెడల నీగుండె లిపుడు బద్దలుచేయుదును. (అని త్రోయుచున్నాఁడు.)

వసు—రక్షించు రక్షించు. బావగారికిచూపవలసిన గౌరవమా యిది?

విజ—ఓరి శుంఠా! విను. ఆద్రోహు లెక్కడకు పోయినారో తిన్నగా చెప్పు. చెప్పకపోతివా చూడు నా—

(అని కత్తి యొఱలోనుండి దూయుచున్నాఁడు.)

వసు—ఓబావా! ఓకరుణామయా! క్షమించు క్షమించు. కోపము శాంతిపఱచుకో. నేను జ్ఞప్తికి తెచ్చుకొనుచున్నాను. మనుష్యుల ధారణశక్తిలో తారతమ్యము లున్నవి. కావలసినది కొందఱికి సమయమునకు స్మరణము రాదు; నాదివట్టిపిఱికిమతి. ఎదుటనీకత్తిని జూచి వెనుకకు పాఱిపోవుచున్నది. నీతో పోరాడ శక్తి యెంత యున్నదో జ్ఞాపకశక్తియు నాకిప్పుడంతే యున్నది.

విజ—భయములేదు నిజముచెప్పు. నీకు నేను హానిచేయను,

వసు—బావా! నీవు నాకెప్పుడును హాని చేయవుగాని నీ చేతిలోని యాభయంకరమైన—

విజ—ఏమీ? నీవు నిజము చెప్పవల్లు లేదు.

వసు—చెప్పుచున్నాను. చెప్పుచున్నాను. నీకు సమస్తమును చెప్పెదను. వినునప్పుడు నీకు చేతిలో కత్తి యేల తోడుకావలెను!

విజ—ఇదిగో కత్తి క్రింద పడవేయుచున్నాను. (పడవేసి) ఇప్పుడు చెప్పు.

వసు—వారు-వారు-అక్కడకు-కాదు కాదు-నా మిత్రుఁడైన చంద్రకేతుఁడు సుదంతను-ఓ విజయవర్మా! నీచేతులు దూరముగా పెట్టు-శారదామఠమువద్ద విడిచి వచ్చినానని చెప్పినాఁడు.

విజ—శారదామఠములోనా?

వసు—అవును. అక్కడనే కామపాలుఁడు నేఁడామెను గలిసికొనఁబోవుచున్నాఁడు.

విజ—నీవు చెప్పినది సత్యమేకద?

వసు—ఈశ్వరసాక్షి! సంపూర్ణసత్యము. ఈ విషయములో నేనెఱిఁగినదింతే.

విజ—ఓరి పిఱికిపందా! ఇఁక నీవు బ్రతికిపోయినావు. ఈ కోపము నిఁక మిత్రద్రోహియైనయా కామపాలునిమీఁదఁజూపెదను.

వసు—నీకోప మంతయుఁ జూపుము. అతనిని జంపుము. తల నఱికివేయుము. నాకది పరమసంతోషము.

విజ—ఇఁక సుదంత నేమి చేయుదును? ఆమె దయనీయురాలు. ఆమెకీవఱకువచ్చినయపకీర్తియేచాలును. ఆమె నాపగకర్హురాలు కాదు.

వసు—బావా! అర్హురాలు కాదు. ఆమె విషయములో నాకును కోపములేదు. ఆమె నాపగకును నర్హురాలు కాదు.

విజ—నీమాట సత్యము కాదు. నీ వనఁగా నెంతవాఁడవు? ఆమె రాజాధిరాజుల స్పర్థకైన నర్హురాలే.

వసు—అవు నవును. నీమాట సత్యము. ఆమె యర్హురాలే. అంతటి యోగ్యురాలిని పోఁగొట్టుకొన్న నీ దుస్స్థితికి జాలిపడుచున్నాను.

విజ—ఓరి పామండుఁడా! నాస్థితికి జాలిపడుచున్నానని చెప్ప సాహసించుచున్నావుగా! నన్నుఁజూచి జాలిపడుటకు నీ వేపాటి వాఁడవు?

వసు—ఓబావా! క్షమింపుము. నే నెంతమాత్రమును జాలి పడలేదు. నామాట నమ్ము.

విజ—నీకు రెండునాలుక లున్నవి. ఓ జడుఁడా! పో పో. నాయెదుటనుండి లేచి పో. ఇఁక నవ్యక్తప్రలాపములు ప్రేలి నాకు మఱింత కోపము తెప్పించకు. నీ యనామకత్వమే నిన్ను రక్షించినది. పో.

వసు—(తనలో) అట్లయిన నా యనామకత్వమే నాకుముఖ్యబంధువు. (ప్రకాశముగా) ఓ విజయువర్మా! పోవుచున్నాను. (తనలో) ఇతఁ డెంత నిర్దయుఁడైన చండకోపనుఁడు!

(ఇద్దఱును వేఱువేఱుగా నిష్క్రమించుచున్నారు)

---

3. రంగము—శారదామఠమూలోని తోఁట.

[భానుమతియు, సుదంతయు ప్రవేశించుచున్నారు]

భాను—నా యన్నగారికి నీవు కనఁబడ కుండవలెనని నిజముగా నే నీమనసులో నున్నావా?

సుదం—ఉండకపోయినయెడల, నే నీ క్రొత్తవేష మెందుకు వేసికొందును?

భాను—ఈ నిమిషములో నొకవేళ నీ కీవేషముమీఁద మక్కువ యుండి యుండవచ్చును. నీ వెల్లకాలమును యోగినివై యుండుటకు మాత్ర మభిలషింప వనుకొనెదను.

సుదం—రాత్రి విజయవర్మ నిశ్చయముగా నా కంతకోపము తెప్పించియుండని యెడల—

భాను—నిన్ను పోఁగొట్టుకొందు నన్న భయముచేత తొందరపడి యతఁ డాసాహసము చేసెనేగాని మఱియొకటి కాఁదు.

సుదం—నీవు నన్ను క్రూరురా లనుకొందువు. అతఁ డీక్షణ మిక్కడ నున్నయెడల, నే నతనిని క్షమించి యుందునని ప్రమాణము చేయఁగలను.

ద్విపద. ఘనప్రియుల్ తప్పులు మనయెడఁ జేయ,
మనకోప మెంతలో మాయమై యడఁగు!
ఒకదిన మెడగల్గ నున్నను దీఱు;
మొకము చూచినయంత మగిసి చల్లాఱు
గతరాత్రి నీ యన్నగా రటువచ్చి
వెతఁబెట్టుటను, వేగ వెడలి పొమ్మంటి;
అతఁడు చేసినయట్టి యపరాధ మరయ
నతికోప మొదవింప నర్హమైనదియె,
కాని యిప్పు డతండు కనఁబడు నేని,
మాన మెంతగ నాదు మదినేఁచుచున్న
దొడరి నో రాతని దూఱకమున్న
యెడఁద యాతనిఁగాంచి యుబ్బిమన్నించు.

భాను—నీవు యోగినితన మెట్లుండునో పరీక్ష చేయుచున్నావు కాఁబోలును!

సుదం—ఈయోగినీవృత్తి నాకర్హతమముగా నుండలేదా?

భాను—పాఱిపోయివచ్చి మాఱువేషము వేసికొనువారికి యోగినీవేష మర్హతమ మైనదే. కాని మతిమాలిన దెవ్వతయో యొకానొకతె తప్ప వివేకము కలిగిన సుందరి యెవతెయు నీవేషము నొక్కరాత్రికంటె నెక్కువకాలము వేసికొన వాంఛింపదు.

సుదం—నీ ప్రియుఁడయిన కామపాలుఁడదె యావైపున నుండి వచ్చుచున్నాఁడు. ఇఁక నే నిక్కడనుండి మీ సల్లాపసౌఖ్యమునకు భంగము కలుగఁ జేయను. భానుమతీ! ప్రియుని మొగము చూచుటకై యెంతసంతోషముతో నీ వావంకఁ దిరుగు చున్నావు?

(అని నిష్క్రమించుచున్నది.)

[కామపాలుఁడు ప్రవేశించు చున్నాఁడు.]

కామ—ఓ ప్రియురాలా! భానుమతీ! నేను నిన్ను విడిచి పోయినతరువాత విశేషము లేవియు లేవుగదా?

భాను—ఏమియు లేవు. నాతండ్రియొద్దకు త్తరము పట్టుకొని పోయినమనుష్యుఁ డింకను రాలేదు.

కామ—అతనియొద్దనుండి యనుకూలమైన ప్రత్యుత్తరము వచ్చునని యెప్పుడును నే నెదురు చూడలేదు.

భాను—అయినను నేనిప్పు డీప్రయత్నముకూడ చేసినాచుట వలన తరువాత నన్ను నామనస్సు బాధించకుండఁ జేసికొన్నాను. నీకు నాయెడల నున్నప్రేమనుగూర్చి నా కనుమాన మెంతమాత్రమును లేదు. అయినను బీదతనము మొదటినుండియు తనలో పుట్టి పెరిఁగి యలవాటుపడని నూతనప్రేమను చంపివేయు దుస్స్వభావము

కలది. మనము కామదేవునినే మనగృహదేవతనుగాఁ జేసికొన దలఁచుకొన్నయెడల, అతనిసౌఖ్యమునిమిత్తమయి మనయిల్లు సుఖప్రదమయినదిగా చేసికోవలెను.

కామ—

చ. పడఁతిరో! యెన్నిసార్లు మునుపల్కవు నాపయికూర్మి పేర్మి నీ
పుడమిని జక్రవర్తి దగుహాంసును బాసెద నంచు నాకడన్!
నుదుటుల వట్టి నెయ్యమును నూల్కొనఁజూపిన నీ నిమిత్తమై
పుడమిని జక్రవర్తిపదము న్విడనాడుచు నేను నొక్కటన్.

ఉ. బీదల మెట్టులౌదు మెదఁ బ్రేమధనం బిటు లింత యుండఁగా!
పైడలి! నీవు ప్రేమమునఁ బట్టపుదేవివి; నే నృపేంద్రుఁడన్;
మేదిని సర్వసౌఖ్యముల మించుచు నెవ్వరు సాటిలేక య
త్యాదరలీల నిద్దఱము హాయిగనుందము సర్వకాలమున్.

[ఉత్తరము చేతఁబట్టుకొని పరిచారిక ప్రవేశించుచున్నది]

భాను—ఈ యుత్తరము నాతండ్రియొద్దనుండి కాఁబోలును!
(అని పుచ్చుకొనుచున్నది)

కామ—ఓ ప్రియురాలా! నామాట నమ్ము. ఈ యుత్తరములో తిట్లును బెదరింపులును తప్ప మఱియేమియు నుండవు.

భాను—అయినను చదివిచూతము. (చదువుచున్నది)

"నా యత్యంత ప్రియపుత్రికా! నీప్రియుని సుఖునిగాఁ జేయుము; నీ యిష్టప్రకారము వివాహమాడుటకే మనఃపూర్తిగా నేనిప్పుడనుమతించుచున్నాను. ఈరాత్రి నీప్రియజనకునితోఁ గలిసి భోజనముచేసి యానందించుటకయి మీరు తప్పక మనయింటికి రండు. నిన్నాశీర్వదించు ప్రియజనకుఁడు—

సుదర్శనవర్మ."

కామ—భానుమతీ! నీవు నాతో వెక్కసక్కెము లాడు చున్నావు.

భాను—కాదుకాదు. నీవే చదువుకొమ్ము. (అని యుత్తర మిచ్చుచున్నది)

కామ—ఏమి యీభాగ్యము! ఇందులో నీవు చదివినట్టె యున్నదే. నిస్సందేహముగా నీతండ్రి యిందులో నేదోభ్రాంతిపొంది యుండును. కానిమ్ము. మనకిప్పు డావిచారముతో పనిలేదు. ఇంక జాగుచేయుటకు నీ కేమియు సాకు లేదుగదా?

భాను—మనము పోయి మనకృతజ్ఞతను నాతండ్రికి తెలుప వలెనుజుమా?

కామ—ముందుగా మన మొక్కపురోహితుని సంపాదించి నీతండ్రి తాను వ్రాసిన దానిని మరల త్రిప్పుకొన్న ప్రయోజనము లేకుండఁ జేసికొని తరువాత పోదము. నేను పరుగెత్తుకొనిపోయి యొక యాజకుని నిప్పుడే తీసికొని వచ్చెదను.

భాను—నీవు మరల నన్నుడఁబాసిన పక్షమున, నీవొకవేళ నన్ను దక్కించుకో శక్తుఁడవు కాకపోదువేమో!

కామ—అట్లయిన నీవును నాతో రమ్ము. కేశవస్వామి యాలయ సమీపమున వసించు యాజకుఁడు నాకు పరిచితుఁడు. ఈ మతములల్లో నుండెడుగుట్టు నీ కీవఱకే తెలిసిపోయినదిగదా? ఇంక దేవాలయములలోనుండు పరిశుద్ధతనుగూడ చూతువుగాని రా.

భాను—అది నేను చూడనక్కఱలేదు. మతములోను మైత్రిలోను పయినటన లెవ్వరి కెక్కువ యుండునో వారే యెప్పుడును మిక్కిలి వంచకులుగా నుందురు.

(ఇద్దఱు నిష్క్రమించుచున్నారు)

[సుదంత మరల ప్రవేశించుచున్నది.]

సుదం—పరిశుద్ధమయిన పరస్పరానురాగమువలనఁ గలుగఁ దగిన సుఖమంతయు ననుభవించుచు వారట్లు పోవుచుండఁగా, నే నొంటరికత్తెనయి యిట్లు నిలుచున్నాను. కావలసినవారి నందఱిని విడిచివచ్చిన దుఃఖమున కయినను తాళనిచ్చునుగాని తాను కామించినవారివియోగముమాత్రము వల పెప్పుడును సహింపనియ్యదు. ఓహో! ఆవచ్చెడువా రెవ్వరు? అతఁడు నిశ్చయముగా విజయవర్మ. అతఁ డీలోపలి కెట్లు రాఁ గలిగినాఁడు? కామపాలుని వలెనే యితఁడును కావలివారికి లంచమిచ్చి వచ్చేయుండును. ఆహా! బంగారమునం దెంతయద్భుతమహిమ యున్నది! ఇతఁ డత్యాతురుఁడయి యెంతకలత నొందియున్నాఁడో! ఇతఁ డింకను నన్నిప్పు డెఱుఁగఁ గూడదు. (అని కావిబట్ట ముసుఁగు వేసికొనుచున్నది.)

[విజయవర్మ ప్రవేశించుచున్నాఁడు.]

విజ—అవునవును. ఆపోవుచున్నవారు వారే. నాకతఁడు చెప్పినది సత్యమే. (అని పోఁబోవుచున్నాఁడు.)

సుదం—అయ్యా! క్షణకాల మాగుము. మీ రిప్పు డిక్కడి కేపనిమీఁద వచ్చినారో చెప్పుడు.

విజ—ఆసంగతి నీకెందుకు? పోనిమ్ము—ఓహో! వా రక్కడ నిలిచినారు! (ఆవంకఁ జూచుచు) ఆమె నిశ్చయముగా వంచకురా లయినసుదంతయే.

సుదం—(తనలో) లేనిపోనియనుమానముచేత నితఁడు వెఱ్ఱిభ్రమ పడుచున్నాఁడు. స్వస్థత లేక నానిమిత్తమయి యితఁ డింత పరితపించుచున్నందుకు సంతోషముగా నున్నది.

విజ—ఇప్పు డెంత వేషము మార్చుకొన్నను, ఆరూప మెంత

మాత్రమును దాఁగునది కాదు. నావంటి కానుదంతయాకారము స్పష్టముగాఁ గనఁబడుచున్నది.

సుదం—(తనలో) ఇతఁడు చక్కగా గుఱుతు పట్టినాఁడు! (ప్రకాశముగా) అయ్యా—

విజ—ఓయోగినీ! నన్ను మాటాడించకు. నన్నాయాసపెట్టఁబోకు—హాదైవమా! ఆమె యాతనిహస్త మెట్లుపట్టుకొని తన కవలంబము చేసికొనుచున్నది. ఓకాంతా! కాంతా!

సుదం—అయ్యా! నీకిప్పుడు కావలసిన దెవరు?

విజ—నీవుకాదు నీవుకాదు. నన్నుశ్రమపెట్టఁబోకు. నీవు రానక్కఱలేదు. ఓయోగినీ! నీయొద్దనుండి యిప్పుడు పోవుచున్నది సుదంత కాదా?

సుదం—ఇంకను సుదంత యీతోఁట దాఁటి పోనేలేదు.

విజ—అవునవును. నేనూహించినది నిజమే. ఇప్పుడామెతోఁ గూడ గడపవద్ద నిలుచున్నవాఁడు కామపాలుఁడు కాఁడా?

సుదం—అవును. అతఁడు కామపాలుఁడే.

విజ—అతఁడుతప్ప మఱియొకఁడు కాఁడని నేనీవఱకే యనుకొన్నాను. ఓయోగినీ! ఇంకొక్కప్రశ్న మాత్రమున్నది. వారిప్పుడేపనిమీఁదఁ బోవుచున్నారో నీవు చెప్పఁగలవా?

సుదం—వివాహమునిమిత్త మనుకొనెదను.

విజ—తెలిసిపోయినది. ఇఁక చాలును. నేనిప్పుడుపోయి వారి వివాహము చెడఁగొట్టకపోతివా— (అని నిష్క్రమించుచున్నాఁడు.)

సుదం—(ముసుఁగుతీసివేసి) అన్యులమీఁద ననుమానమున్నప్పుడు కాముకులేమో మహాసూక్ష్మదృష్టి కలవారుగా నుందురందురే, నాప్రియుఁడిక్కడ గుడ్డివాఁడగుచున్నాఁడేమి? ఈభ్రమకు

నాతో భానుమతి చెప్పినకథ హేతువయి యుండును. విశ్రాంతిలేక నానిమిత్తమయి యితఁ డింతకలఁత పడుచుండుట నాకు పరమా నందముగా నున్నది. ఇతఁడు తాను పొందినభ్రమ తెలిసికొని యద్భుతపడునప్పుడు దగ్గఱ నేనుమాత్రి మేల యుండకపోవలెను! ఇతఁ డీదారిని బోవునప్పటికి వెనుకనేపోయి యక్కడ నేనుప్రత్యక్ష మయ్యెదను. భానుమతి తోడులేకుండ పెండ్లికూఁతురు కాఁకూడదు.

ద్విపద. అనుతాపశబ్దంబు లనయ మిల్లెడల
వినఁబడుచుండంగ వెలయు మఠంబ!
నీయొద్ద సెల విదె నేఁ బోయి వత్తు
హాయిక యెప్పు డీపాడింటనుండి
మ్రొక్కులకును స్తోత్రముల కేడ్పులకును
నొక్కట నలవడ్డ యోగినులార!
సెల వియ్యఁగదరమ్మ చెచ్చెర నాకుఁ
జింతలమఠమును శీఘ్రింబ విడిచి
సంతోషభూమికిఁ జనుచున్న దాన.

(అని నిష్క్రమించుచున్నది)

---

౪. రంగము—దేవాలయము యుండరివీథి.

[వసుకాముఁ డెదురురాఁగా కామపాలుఁడు ప్రవేశించుచున్నాఁడు]

కామ—ఓహో! నామిత్రుఁడు వసుకాముఁడా!

వసు—ఏమీ! కామపాలా! నన్ను దీవింపుము. నేను భాను మతిని భద్రముగా తెచ్చినాను

కామ—తెచ్చినావా? ఆభానుమతియు నీవును చిరకాలసుఖ మనుభవింతురుగాక!

వసు—నావివాహము చేయించుటకు యాజకునినిమిత్తమయి నే నిక్కడకు వచ్చినాను.

కామ—అట్లయినపక్షమున మన యిద్దఱము నొక్కపని మీఁదనే వచ్చినాము. నేనావీధినున్న నారాయణశర్మను పిలుచుకొని పోవలె నని వచ్చినాను.

వసు—నాకందుకు సంతోష మగుచున్నది. అతఁడు నావివాహము ముందుగా జరపవలెను. నాప్రియురా లావల వేచి యున్నది.

కామ—నాప్రియురాలును వేచియున్నది. ఆమెను నేనా వసంతమంటపమువద్ద విడిచి ముందు వచ్చినాను.

వసు—నేనిప్పుడు వేగముగా మరల సుదర్శనవర్మ యింటికి పోవలెను.

కామ—నేనును పోవలెను.

వసు—అట్లయిన యెడల కాలహరణము లేకుండ మన యిద్దఱ వివాహములు నొక్కసారియే చేయించుకొందము. నీకు నేను కన్యాప్రదాతనుగా నుండెదను. నాకు నీవు కన్యాప్రదాత వగుము. పురోహితుని పిలుచుకొనివత్తము రమ్ము. నీ కీవివాహము నాసాహాయ్యము మూలమున నగుచున్నది సుమా.

కామ—అవు నవును. సందేహము లేదు.

(ఇద్దఱును నిష్క్రమించుచున్నారు)

౨ రంగము — కేశవస్వామి గర్భాలయము ముందరి మంటపము.

[గండభేరుండాచార్యులును, కంఠీరవాచార్యులును, క్రిందపళ్లెములో ప్రసాద ముంచుకొని చేతులలో గిన్నెలు పట్టుకొని కూరుచుండి ప్రవేశించు చున్నారు.]

కంఠీ—స్వామీ! మీదాసానుదాసునికి పెరుమాళ్ళసేవకు సెలవా?

గండ—ఇఁక నీవు స్వీకరింపవచ్చును.

గీ. వ్రాలు చున్నాఁడు సూర్యుండు పశ్చిమమున;
ప్రొద్దు గ్రుంకిన వత్తురు పూజ కొరులు;
వాంఛ తీఱంగ మధు వింత వడిగ మనము
త్రాగవలయును కేశవార్పణముగాఁగ.

(అని త్రాగుచున్నాఁడు.)

కంఠీ—స్వామీ! మీ పెరుమాళ్ళబుడ్డి నావద్దికిఁ బంపుఁడు. ఈ మధ్యాహ్నము స్వామికి భోగము చేయించిన పద్మావతి పేరుచెప్పి యింకొక గిన్నె త్రాగవలెను. ఈరాత్రి పెరుమాళ్ళు మనలో తాండవ మాడవలెను.

(అని చేతిలో గిన్నె త్రాగి రెండవచేయిచాచుచున్నాఁడు.)

గండ—నేను గ్రామాంతరము పోయిన నాలుగుదినముల లోను స్వామివారి కెవ్వరెవ్వరేయేతిరుకైంకర్యములు చెల్లించినారు?

కంఠీ—మన పట్టణములోని, మధుసూదనదాసుఁడు స్వామికి కంఠాభరణము చేయించుమని నూఁఱువరహాలు సమర్పించినాఁడు.

గండ—స్వామికిఁ గాదు మన సానికి కంఠాభరణము చేయింతము. అది స్వామిమెడలోకంటె దానిమెడకే యందముగా

నుండును. ఇఁక భక్తు లెవ్వరును మ్రొక్కులు చెల్లింపలేదా?

కంఠీ—చెల్లించినారు. మనపట్టణములో లోభియని పేరు పడిన యీ ముసలిగోవిందసేనుఁడుచచ్చినతరువాతతనపేరుస్థిరముగా నుండుటకయి పెరుమాళ్ళసన్నిధానమునందు నందాదీపము పెట్టుమని వెండిదీపస్తంభమును, ఏటేట ధనుర్మాసములో తనపేరుపెట్టి యొకనాఁ డుత్సవము చేయించుమని వేయివరహాలును, అమ్మవారికి పట్టుచీరయు, సమర్పించినాఁడు.

గండ—అతఁడు పరమభాగవతోత్తముఁడు. ఆ వైకుంఠములో స్వామి సన్నిధానమందు నిత్యముక్తులలో చేరియుండును. అతఁ డిచ్చిన సొమ్మేలాగు వినియోగింపవలెనో తరువాత సావకాశముగా నాలోచింతము కాని దీపస్తంభము మాట ముందుగా పరిష్కరింతము. బ్రతికియున్న భూదేవత లుండఁగా దానిని ప్రాణము లేని రాతిదేవతలయొద్ద నుంచఁగూడదు. స్వామివారికి చీకటిలో భయము లేదు. ఆదీపము మన గదిలోనే పెట్టుకొందము. ఆ పట్టు చీర నీవు నీభార్య కిచ్చుకో. ఎవరో తలుపు తట్టుచున్నారు.

[కంఠీరవాచార్యులు తలుపు తీయఁగా సేవకుఁడు
ప్రవేశించుచున్నాఁడు.]

సేవ—ఎవరో వచ్చి గండభేరుండాచార్యులవారిని పిలుచుచున్నారు.

కంఠీ—స్వామీ! మీ కోసర మెవ్వరో వచ్చినారఁట.

గండ—(ఒకచేతిలో మధుపాత్రముతోను రెండవచేతిలో దధ్యోదనకబళముతోను ముందుకువచ్చి) ఓ శుంఠా! పెరుమాళ్ళసేవ చేసి స్వామివారికి నైవేద్యము పెట్టుచుండఁగా నడుమ వచ్చిపూజా భంగము చేసినా వేమిరా?

సేవ—స్వామీ! మీరు మీ పూజ ముగించినారని యనుకొన్నాను.

గండ—నీవు శుద్ధ బుద్ధస్వరూపుడవు. ఇంతకాలమునుండి మావద్ద నున్నను నీకు పూజాకాలమే తెలియదు. మీరు శుద్ధ భక్తి హీనులు. మీకు కడుపే వైకుంఠము. మఱియిల్లి యీ ప్రకారముగా నిహలోక సుఖములలో సదా మునిఁగి తేలుచుండెడు మీవంటి యుదరపరాయణులకు పరమపదము గూరి యీప్రకారముగా శరీర శోషణముచేసికొనుచు స్వామిసన్నిధానమునందు నిరంతరము కృశించుచుండు మాబోంటి భాగవతశిఖామణుల రహస్యము లెట్లు గోచరములగును? (అని దధ్యోదనపుముద్ద కొఱుకుచున్నాఁడు.)

సేవ—ఎప్పుడును మాకడుపు పట్టినంతకంటె మే మెక్కువ తినము. స్వాముల కారగింపు కాఁగా మిగిలిన ప్రసాదములో మీ రింత చేతిలో పెట్టినదేకదా మాకు—

గండ—ఓరీశుంఠా! భగవదపచారముకంటె భాగవతాపచార మెక్కువ పాపము సుమా. మీ వంటి పామరులకు పరలోకచింత లేదు. సమయము వచ్చినప్పుడు కేవల ఫలహారము చేసి మావలె నీ వొక్కదిన ముండఁగలవా?— ఓ కంఠీరవాచారీ! పెరుమాళ్ళ నివేదనచేసి మన మిప్పుడు త్రాగుచున్న గుమగుమ పరిమళించుచున్న యీ తిరుపానక మేమయిన గిన్నెలో మిగిలినయెడల నీ వారగింపు చేయుము. (తనచేతిలోని దధ్యోదనమును మ్రింగుచు) ఓరి తిండిపోతా! ఆ వచ్చినవా రెవరో నాకు చూపు. నేను వచ్చెదను.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

---

౫. రంగము—దేవాలయముఖమంటపము.

—:o:—

[యాజ్ఞికుఁడు నారాయణశర్మయు, వసుకాముఁడును, కామపాలుఁడును ప్రవేశించుచున్నారు.]

వసు—ఆ పాడుగండభేరుండాచార్యుఁ డెంతసేపటికిని కదలి రాకున్నాఁడు! ఆతఁడు లోపల దేవతార్చన చేయుచున్నాఁడేమో!

కామ—లేదు. అదిగో వచ్చుచున్నాఁడు చూడు.

[గండభేరుండాచార్యుఁడు ప్రవేశించుచున్నాఁడు.]

గండ—శ్రీమతే రామానుజాయ నమః

కామ—ఓ యాచార్యవర్యా! నేను నీ యాశీర్వచనముకోరి వచ్చినాను.

వసు—ఓ యాచార్యోత్తమా! నిజముగా నీవలన నొకకార్యముండినఁ మేము నీయనుగ్రహము కోరి వచ్చినాము.

గండ—మీరు వచ్చినకార్య మేమో చెప్పుఁడు.

వసు—మా కిప్పు డీ దేవాలయములో వివాహము కావలసి యున్నది. మా వెంటఁ బురోహితుని దెచ్చుకొన్నాము.

గండ—ఇటువంటి పడుచువాండ్రను మా దేవాలయములో వివాహము చేసికోనియ్యఁగూడదు. మీరు తరువాత మా కేమయినను చిక్కులు తెచ్చిపెట్టుదురు. కాఁబట్టి యిక్కడ వివాహమునకు నే నొప్పుకోను. నా కొక గొప్పయాక్షేపణ యున్నది.

కామ—వసుకామా! ఈయాచార్యుని సమాధానపఱచుటకు మంచిసాధన మేమయిన నున్నదా?

వసు—తిరుగులేనిదొడ్డిసాధన మొకటి యున్నది. దానిని మించినసాధనము మఱియొకటి లేదు. నీవిప్పుడు రెండువరహాలీతని

చేతిలో పెట్టితివా, దానితో సమస్తాక్షేపణలును నిమిషములో పోవును.

కామ—ఓయాచార్యోత్తమా! మాయందనుగ్రహింపుము.

(అని చేతిలో సొమ్ము పెట్టుచున్నాఁడు.)

గండ—ఈవిషయములో నేను ధన మంగీకరింపవలసినపని కాదు. కాని మీరు నాయోగ్యతను కనిపెట్టి భక్తిపూర్వకముగా దక్షిణ యిచ్చినప్పుడు దానిని నేనుస్వీకరింపక నిరాకరించిన పక్షమున మీమనస్సులు చిన్నపోవునని గ్రహించుచున్నాను.

కామ—ఇఁక మనము లోపలికి పోవుదము రండు.

వసు—ఓనారాయణశర్మా! ఇంక జాగుచేయక నీవు మా సంతోషములకు కారణభూతుఁడవు కమ్ము.

నారా—మంచిది. ఈవివాహమువలన ముందొక వేళ మీలో నెవ్వరైన పశ్చాత్తాప పడవలసివచ్చెడుపక్షమున మీరప్పుడు నన్ను నిందింపవలసినపని లేదు సుమండీ.

కామ—(తనలో) ఈహితబోధ పాప మీవసుకామునకు తగియున్నది. (ప్రకాశముగా) ఓ బ్రాహ్మణోత్తమా! నీపని నీవు జరిగింపుము. అపయినేమిసంభవించినను నేనుబద్ధుఁడ నయియుండెదను.

వసు—నేనంతకంటెను బద్ధుఁడ నయి యుండెదను.

[అప్పుడు భానుమతి పరుగెత్తుకొనివచ్చి ప్రవేశించుచున్నది.]

భాను—ఓ కామపాలా! విజయవర్మ వసంతమంటపమువద్దకు వచ్చి మన మెక్కడ నున్నామని యక్కడవారి నడుగుచున్నాఁడు.

వసు—ఎవరు? సుదర్శనవర్మకొడుకు విజయవర్మా? అతఁడు నాపే రడుగలేదుగద?

కామ—ఓ ప్రియురాలా! జడియఁబోకు నే నాతనిని శాంతాత్ముని జేసెదను.

వసు—ఆపని నీచేత కాదు. ఓకామపాలా ! నీవు నామాట విని పాఱిపో. ఆవిజయవర్మ దయాదాక్షిణ్యములు లేనిక్రూరకిరాతుఁడు. అతనివద్దనల్లత్రాఁచువలె నిడుపయినచెడుకత్తి యొక్కటి యున్నది. ఈశ్వరసాక్షికముగా చెప్పుచున్నాను. అతఁడు నిశ్చయముగా దానితో నీగొంతుక కోయనలెనని వచ్చుచున్నాఁడు.

కామ—నా కాభయము లేదు.

వసు—భయము లేకపోయినపక్షమున నీ వుండుము. నేను మఱియొకపురోహితుని సంపాదించి యింకొక దేవాలయములో వివాహము చేయించుకొనెదను. ఈరెండుకాళ్ళలోను శక్తియున్నంతవఱకు నిఁక నే నాతనికంటఁ బడను. (అని పరుగెత్తి పోవుచున్నాఁడు.)

భాను—(మేలిముసుఁగు వేసికొను చున్నది.)

[విజయవర్మ ప్రవేశించుచున్నాఁడు.]

విజ—కష్టపడి చిట్టచివఱకు మిమ్మిక్కడ పట్టుకొన్నాను.

కామ—మంచిది. ఇప్పుడేమనెదవు?

విజ—ఓరి పరమనీచుఁడా! మిత్రద్రోహీ! వంచకుఁడా! నమ్మించి ద్రోహము చేసినపురుషునివంకఁ నింతనిర్భయముగా చూడఁగలుగుటకు నీకీధైర్య మెక్కడినుండి వచ్చినది రా?

కామ—ఓయీ! నీవు దురాగ్రహాగ్రస్తుడవయి యున్నావు. నాప్రాణాధికురా లయినప్రియురాలిని నేనిప్పుడు వివాహము చేసికొనఁబోవుచున్నమాట సత్యమే. కాని యిల్లు బయలుదేఱి రమ్మని నేనామె నెంతమాత్రమును ప్రోత్సాహపఱుపలేదు. నీవలెనే నేనును మోసమున్న ద్వేషించువాఁడనే. దైవముతోడు! ఆమె తనపితృ

గృహము విడిచివచ్చినదని నేనామెను కన్నులార చూచువఱకును నాకు తెలియనే తెలియదు.

విజ—ఇది వట్టిపనికిమాలిన సమాధానము. నీవీవిషయములో తప్పక మిత్రద్రోహముచేసినావు. ఆమె మొండిసాహసికత్వముచూచి యిట్టిద్రోహ మేదో జరిగిన దని మనసులో నేనీవఱకే యనుమానపడినాను. ఈసంగతి యంతయు నీతార్పుకాఁడయినయీపాపండుఁడు నాతో స్పష్టముగా చెప్పినాఁడు. ఇఁక నీవు చేసినపనికి సాకులు వెదకిన ప్రయోజనము లేదు. ఈద్రోహము చేయసాహసించినావు గనుక నీవిప్పుడు నావెంటవచ్చి, చేసినపని చేసితి నని దృఢముగా చెప్పుటకు నీకు ధైర్యమున్నదని కనఁబఱుపుము.

భాను—(జనాంతికముగా) ఓ కామపాలా! నే నిప్పు డీతని భర్తగ కనిపెట్టినాను. ఇతనిని నా కొప్పగింపుము. నే నితనిభ్రమ నివారణము చేసెదను.

నారా—అయ్యా! ఆశపడి వచ్చిన కాముకులయొక్క పొందు చెడఁగొట్టుట నీకు ధర్మము కాదు.

విజ—ఓ పురోహితా! ఇందులో నీవేమియు సంబంధము కలుగఁ జేసికో కూడదు. ఇతఁడు పాణిగ్రహణము చేసికోఁ దలఁచుకొన్న యీ సుందరి నాసొత్తు.

నారా—అట్లయినపక్షమున నేనిఁక వివాహముచేయించను. ఓ సుందరీ! ఇతనిని చేపట్టెద నని నీ వెప్పుడయిన వాగ్దానము చేసియున్నావా?

భాను—(తల యూఁచుచున్నది.)

విజ—ఓసుదంతా! నీమౌనమునకు నాకు సంతోష మగుచున్నది. నీజిహ్వ యసత్యము పలుకుచుండఁగా వినుటకు నా కిష్టము

లేదు. నిన్ను నేను దూషింప లేదని స్మరించుకొనుటయే నీకు తగిన శిక్ష.

[ముసుఁగు వేసికొని సుదంత ప్రవేశించుచున్నది.]

సుదం—ఏమి యీహాస్య మిక్కడ !

విజ—కామపాలా! దేవాలయ మగుటచేత నీవిక్కడ నిరపాయుఁడ వయినావు. ఇఁకముందు మన మెక్కడను కలిసికోక పోము లే. (అని పోఁబోవుచున్నాఁడు.)

సుదం—(అతనిచేయి పట్టుకొనుచున్నది.)

భాను—(రెండవచేయి పట్టుకొని) కొంచెముసేపు నీకోపము చల్లార్చుకొని యొక్కసారి కరుణించి యీవంక చూడుము.

సుదం—నిన్ను నిలిపి నీ కోపశాంతి చేయుటకయి నేనును తోడుపడవలెను.

భాను—నీ కత్యంత ప్రేమాస్పదురాల నయిన నన్నానవాలు పట్టలేవా!

సుదం—నా ప్రియుఁడ వయి యుండియు నీవీప్రకారముగా నన్ను విడిచి పాఱిపోవచ్చునా ?

(ఇద్దఱును ముసుఁగులు తీసివేయుచున్నారు.)

విజ—ఇదియేమి ? నాచెల్లెలా ? సుదంతకూడనా ? నాకిక్కడ చిత్తవిభ్రాంతి కలుగుచున్నది.

భాను—ఓ ప్రియసహోదరా! నేను నీ చెల్లెలనే.

నారా—ఏమి యీ ధర్మవిరుద్ధము ! ఇతఁడు తన తోడఁబుట్టిన దానినే వివాహ మాడఁ దలఁచుకొన్నాఁడా ?

భాను—ఎంత సిగ్గుపాటు! నీవు నీ సోదరినే తెలిసికోలేక పోయినావు!

సుదం—నీప్రియురాలినే తఱిమివేయుట యంతకంటెను—

భాను—అనుమానముచేత జను లెంత కన్నుగానని వారయ్యె దరో నీకు తెలియదా?

సుదం—ఇఁకముందును నీ వీలాగుననే యనుమాన పడు చుండెదవా?

విజ—ఎప్పుడును పడను—ఓ సోదరీ! నీవు క్షమింతువని నే నెఱుఁగుదును—ఓసుదంతా! నిన్ను నే నెట్లు క్షమింపఁ వేఁడు కోఁగలనో—

సుదం—అక్కఱలేదు. "నన్నాయాస పెట్టఁబోకు" మని యింతకు ముందే నన్ను కసరినావు. "అయ్యా! నీ కిప్పుడు కావలసిన దెవరు?" అని నే నడిగినప్పుడు "నీవు కాదు నీవు కాదు" అని నాకు తెలియఁజెప్పినావు. ఓ కామాంధా! నా విషయమయి యిఁకముం దెప్పుడును శంక పడనని ప్రమాణము చేసెదుపక్షమున, నిన్ను మన్నించెదను.

విజ—లోకములోని సర్వదేవతల—

సుదం—చాలును. ఇప్పు డెంత దృఢముగా ప్రమాణము చేయ నారంభించినావో ముందు నీ వంతదృఢముగా నే చేసినబాసను చెల్లింపవలెను సుమీ. (అని చేయి పట్టుకొనుచున్నది)

భాను—అన్నయ్యా! నీవు క్షమింపుమని వేఁడుకోవలసినవా రిక్కడ మఱొక్క రున్నారు.

విజ—ఓ కామపాలా! ఈ సంగతి తలఁచుకొనుటకే నాకు సిగ్గగుచున్నది. నన్ను—

కామ—విజయవర్మా! నీవు క్షమార్పణము చేయవలసిన పని లేదు. నేనురు కాముకుఁడనే గనుక కాముకుల కోపమురుగణన

చేయరా దన్నమాట యెఱుఁగని వాఁడను గాను. మన మిాత్రబ్రాహ్మణునితో లోపలికిఁ బోయి ముందుగా మన పెండ్లితంతు జరిపించు కొందము రమ్ము. ఈభ్రమకు కారణము తరువాత నీకు సావకాశముగాఁ జెప్పెదను.

ఉ. ప్రేమనటించుచుం బ్రియులు ప్రేలు ప్రలాపము లాలకించి లోఁ
గాముఁడు నవ్వుచుండు; మదిఁ గాముకు లెవ్వరు నిష్కళంకమౌ
ప్రేమ వహింతురో యెఱిఁగి వేగఫలంబిడు; ప్రేమచేతనే
తాము వివాహమాడి తగుధన్యులకే యిడు దీర్ఘసౌఖ్యముల్.

(అందఱు నిష్క్రమించుచున్నారు.)

౽ రంగము — సుదర్శనవర్మ గృహములోని సభామంటపము.

[సుదర్శనవర్మయు, దామోదరుఁడును, సేవకులును, ప్రవేశించుచున్నారు]

సుద — ఈరాత్రి మనయింట నేమియు లోప ముండఁగూడదు. మన పరిచారకు లందఱును నవ్వుమొగములు గలవారయి మహోల్లాసముగా నుండవలెను. ఈరాత్రి విందుకు వచ్చువారి నందఱిని మిారాదరించి సమస్తోపచారములునుజరుపవలెను.విన్నారా? పొండి.

సేవకులు — చిత్తము. (నిష్క్రమించు చున్నారు.)

సుద — దామోదరా! నీయజమానుఁ డెక్కడ నున్నాఁడు? అతఁడు సాయంకాలభోజనమున కింటికిఁ రాఁడా యేమి?

దామో — నిశ్చయముగా రానట్టే యున్నాఁడు. అతనికిచిత్త

చాంచల్యము కలిగిన దేమోయని నాకు సందేహముగా నున్నది. అతఁడు నన్నింతకుముందు బెదరించి యింటికి సాగనంపినాఁడు.

సుద—అతఁ డేదో చన్నెలాడిమెరను బడి తిరుగుచున్నాఁడు కాఁబోలును! వట్టిపడుచునిర్భాగ్యుఁడు. వాఁడు రాఁకపోయినను మన వేడుక కొఱఁతపడఁగూడదు. నీవుపోయి లోపల కావలసినసన్నాహము చేయింపుము.

దామో—చిత్తము. (నిష్క్రమించుచున్నాఁడు.)

సేవ—(ప్రవేశించి) అయ్యా! వసుకాముఁడు వచ్చియున్నాఁడు.

సుద—లోపలికి రమ్మను.

సేవ—చిత్తము. (అని నిష్క్రమించుచున్నాఁడు.)

[వసుకాముఁడు ప్రవేశించుచున్నాఁడు.]

సుద—ఓ క్రొత్తపెండ్లికొడుకా! అల్లుఁడా! మిమ్ము క్షమించినాను. నా యాశీర్వాదము లొందుఁడు. నా ప్రియపుత్రిక యెక్కడ! ఏదీ భానుమతి?

వసు—ఆమె వాకిటలో నున్నది. మీ యాశీర్వాదము పొందవలెనని యెంతో కుతూహల పడుచున్నది కాని లోపలికి వచ్చుటకు మాత్రము జంకు చున్నది.

సుద—నీవు పరుగెత్తుకొనిపోయి దానిని లోపలికి తీసుకొని రా

వసు—(నిష్క్రమించు చున్నాఁడు.)

సుద—పాపము! నన్ను చూచుటకు మొగము చెల్లక భయపడుచున్నది కాఁబోలును! దాని ముద్దుమొగము చూడవలెనని నాకెంతో తొందరగా నున్నది.

వసు—(తెరలో) నాముద్దుగుమ్మా! రమ్ము. నావడఁకు దేవతా! రమ్ము.

[వసుకాముఁడును, రాగమంజరియు ప్రవేశించుచున్నారు.]

సుద—(ఎదుర్కొనుటకయి పరుగెత్తుచున్నాఁడు.)

రాగ—(సుదర్శనవర్మ కాళ్ళమీఁద పడుచున్నది.)

సుద—నాకన్నతల్లీ! నాకొక్కసారి నీకౌఁగిలి యిమ్ము. (అని చేతులుచాఁచి యులికిపడి వెనుకకువచ్చి) ఈరాక్షసి నాయింటి కేలవచ్చినది?

సుద—ఓ సుదర్శనవర్మా! మీ రీమెను క్షమించెద మని యిప్పుడేకదా నమ్మిక యిచ్చినారు? సిగ్గుచేత నాప్రియురా లెట్లు కుంగిపోయినదో చూడుఁడు.

వసు—నిశ్చయముగా కుంగినది. ఇది ముసలి రాగమంజరి. నా కూఁతు రెక్కడ? భానుమతి యెక్కడ?

వసు—ఇదిగో మీకన్నులయెదురనే యున్నది.— ఓప్రాణే శ్వరీ! సిగ్గుపడఁబోకు.

సుద—ప్రాణేశ్వరీ! నీప్రాణముదీయుటకు దొడ్డప్రాణేశ్వరి దొరకినది. అయ్యో! నీ వీరాగమంజరినే వివాహము చేసికోలేదుగద?

రాగ—(సాష్టాంగపడి) ఓ బాబయ్యా! నన్ను మీబిడ్డనుగా భావించుకొందురని ప్రార్థించెదను.

సుద—బాబయ్యా? బాబయ్యా? నీవద్ద కురూపముకంటెను మొండితనము హెచ్చుగా నున్నట్లున్నదే.

వసు—నామనోహారిణీ! పాదముల మీఁదనుండి లేచి నీ మృదుబాహులతల నీతని కంఠమునందు తగిలించి నీ వీతని బిడ్డవని యొప్పింపుము.

రాగ—అయ్యా! నన్ను క్షమింపుము.

(అని కౌగిలించుకొను చున్నది.)

సుద—ఇక్కడ నరహత్య జరుగుచున్నది. ఓ సేవకులారా! మీయజమానుని రక్షింపుఁడు రక్షింపుఁడు.

[సేవకులు ప్రవేశించుచున్నారు.]

సేవ—అయ్యా! ఇప్పు డుపద్రవ మేమిసంభవించినది?

సుద—ఈపాడు పాషండుఁడు నాగొంతుక పిసుకుటకయియీ ముసలితొత్తును తెచ్చి నాకొప్పగించినాఁడు.

వసు—హా! దైవమా! ఈమె యీతని కన్నకూఁతురు. ఈతఁడు కఠినచిత్తుఁ డయి యీమెను క్షమింపకున్నాఁడు.

[కామపాలుఁడు, భానుమతి, ప్రవేశించి సుదర్శనవర్మ పాదములకు మ్రొక్కుచున్నారు.]

సుద—నా దేహము మండుచున్నది. కంప మెత్తుచున్నది నాముం దీవేషము లెక్కడివి? ఇక్కడకు నిన్నెవ్వరు రమ్మన్నారు?

కామ—ఈమెభర్తను నేను.

వసు—ఈమాట సత్యమే. ఈతఁడే యీమెభర్తయని నేను నిశ్చయముగా చెప్పఁ గలను. వీ రిద్దఱిని దేవాలయములో పురోహితునివద్ద నేనే యొప్పగించినాను. కన్యాదాతనుకూడ నేనే కావలెననుకొన్నాను.

సుద—నీవే యొప్పగించినావా?

వసు—అవును. నేనే యొప్పగించినాను. ఇతఁడు నా కాప్తుఁడయిన కామపాలుఁడు; ఇతని కాళ్ళకు బంధము తగిలించెద నని నే నప్పుడు మీతో మనవిచేసినది యీ చిన్నదాని విషయమే.

సుద—నీకేమి మతిపోయినదా? లేక త్రాగి దేహము తెలియకున్నావా? ఇది నా కూఁతురు.

వసు—కాదుకాదు. ఆ మతిభ్రమయు కల్లుమత్తునుగూడ మీకే కలిగినవి. ఇదిగో మీకోమార్తె యీమె.

సుద—ఓయన్యాయధన్యురాలా! ఇందులో వాస్తవమేమో జరిగినదంతయు నీవు చెప్పు.

రాగ—ఓ సుదర్శనవర్మా! సర్వమును మారూపములే మీరిప్పుడు చెప్పుచున్నను, నేనును విన్నపము చేసెదను. మీరు మీకోమార్తెను నన్నును తిన్నగా చూడుఁడు.

వసు—ఏమిపాపము! నా పాడుచెవు లీమెమాటలనే వినుచున్నవా?

రాగ—నేఁటియుదయమున మీరు మీకోపవేగములో కొంచెము పొరపాటు చేసినారు. మీరు మీకోమార్తె నావలికి తోసివేసి మీసేవకురాలిని గదిలోపెట్టి తాళము వేసినారు. దీనిసత్యమిది.

వసు—హాదైవమా! హాదైవమా! ఈబుద్ధిమంతుఁడు ముసలి రాగమంజరికి బదులుగా తనకోమార్తెనే యింటినుండి పంపివేసినాఁడు!

సుద—హాదైవమా! హాదైవమా! ఈబుద్ధిమంతుఁడు నాకోమార్తెకు బదులుగా ముసలిరాగమంజరినే వివాహము చేసికొన్నాఁడు!—ఇఁక తక్కిన పనియంతయు నెట్లు జరిగినది?

రాగ—నేను మీపుత్రికాప్రతినిధినై యీమెస్థానమునగదిలో కూరుచుండి యిక్కడ నా సరసనున్న యీ ధీమంతుని ప్రేమకు పాత్రిరాలనయి యీయనను భర్తనుగా దక్కించుకొను భాగ్యమును పొందితినని తప్ప నేను మఱేమియు చెప్పవలసినది లేదు.

వసు—భర్తనుగానా? ఓసి ముసలిభూతమా! నేనింకను నీకు భర్తనుగా నుండెద ననుకొన్నావా? ఇది వట్టిమోసము! కేవల

మాయ! హీనమైనవంచన! ఈపనిచేసినందుకు మీరందఱును తలలు వంచుకోవలెను.

కామ—ఓ వసుకామా! మాయ యని నీవుకూడ తప్పించు చున్నావా?—ఓ సుదర్శనవర్మా! నామాట వినుము. ఈజిత్తులమారి పామండుఁడు నీకోమార్తె కిచ్చెడియరణ మంతయు పుచ్చుకొని దానికి బదులు నీకోమార్తెకు స్త్రీధనముగా తానుంకువ యేమియు నియ్యక నిన్ను మోసపుచ్చుటకయి కృషిచేసి యీఫల మంతయు తానే తెచ్చుకొన్నాఁడు. ఇది యితని స్వయంకృతాపరాధము.

సుద—నన్ను మోసపుచ్చుటకా?

భాను—అందుకు సందేహ మేమి? ఈసంగతి మీయెదుటనే మే మిప్పుడు ఋజువు చేయఁగలము.

సుద—ఓరి పాపాత్ముఁడా! ఇది నిజమయియే యుండును. కాకపోయిన యెడల, రాగమంజరి ముఖమువంటి ముఖమును చూచిన తరువాతఁగూడ నితఁ డింత సాహసము చేసియుండఁడు. ఓభూలోక బృహస్పతీ! నేను హృదయపూర్వకముగా నిన్నును నీ భార్యను సుఖవంతులగుఁ డని యాశీర్వదించు చున్నాను.

భాను—'కామవిషయములో మోసము చేయుట నిందార్హము కాదు' కాదా? నీనీతి నీకే పనికివచ్చినది.

కామ—నీమంత్రాంగశక్తి యిప్పుడు స్పష్టమయినది! నీపద్ద నింద్రజాలమ హేంద్రజాలము లున్నవి!

భాను—నీవు శంబరాదులను మించిన మోసగాఁడవు!

సుద—అవునవును. మేనత్త యితనికి చిన్నప్పుడు బృహస్పతి యని పేరు పెట్టినది.

వసు—లోకములో నున్నమాయ లన్నియు మీయొద్దనే యున్నవి. ఇటువంటివంచనకు నేను లోఁబడుదు ననుకొన్నారా?

కామ—ఓ వసుకామా! నీకు నే నొక్కబుద్ధి చెప్పెదనువిను. నీకు లభించినదానితోనే తృప్తిపొంది యూరకుండుము. లేకపోయిన పక్షమున పరులను వంచింపఁబోయి మోసగాఁడే మోసపోయినాఁడని యెగతాళిచేసి లోకులందఱును నిన్ను చప్పటలుకొట్టి నవ్వెదురు సుమా.

వసు—నా కాపరిహాసము లక్ష్యము లేదు. ఈవంచన నేను సహింపను—ఓసుదర్శనవర్మా! దీని కంతకును నీవే కారకుండవు. నీవు గదిలోపెట్టి తాళము వేసినదానిని జిహ్వ పడిపోవునట్లుగావర్ణన చేసి, నాతల్లి యంత ముదిముఖము కలదనియు కుబ్జవంటికురూపిణి యనియు నేను చెప్పినప్పుడు నామాట పెడచెవినిబెట్టి కోపపడినావు.

రాగ—ఓరి జిత్తులమారినక్కా న న్నేమన్నావు?

సుద—మేలుమేలు. మంచిపని చేసినావు. రాగమంజరీ! ఆలాగున బుద్ధిచెప్పు.

రాగ—ఓ నడపీనుఁగా! నీయందమునకు నీవు సౌందర్యము పేరుకూడ తలపెట్టుచున్నావా? పిల్లికన్నులును, చప్పిదౌడలును, దొప్పముక్కును, మిట్టనొసలును, పెట్టుకొని కొండముచ్చువలెనున్న నీవుకూడ న న్నాక్షేపించవలెరా?

సుద—రాగమంజరీ! తగినట్లు చెప్పినావు.

రాగ—కత్తికట్టి సేనలో కొలువుచేసివచ్చినతోడఁబుట్టినవాఁడొకఁడు నాకిక్కడ నున్నాఁ డన్నమాట మఱచిపోకు. నావిషయములో నీవన్యాయము చేసితివా—

వసు—నీవును నీతోఁడఁబుట్టినవాఁడును కట్టకట్టుకొని నిప్పులో
పడుండి. మీబాధ విఱుగడ చేసికొనుట కయి నే నిప్పుడు కాశీకి
లేచిపోయెదను.

రాగ—నీ వెక్కడకుపోయినను నేను నీ వెంటరాక విడువను.

సుద—ఓ రాగమంజరి! నీదూదివంటిచేతు లొక్కసారి యత
నికి సోఁకనిమ్ము.

[వసుకాముఁడును, రాగమంజరియు, నిష్క్రమించుచున్నారు.]

సుద—మంచిది. భానుమతీ! నిజముగా నీవీ బీదప్రభువును
వివాహము చేసికొన్నావా?

భాను—మీయాజ్ఞకు బద్ధురాలనయి రెండుగడియలక్రిందటనే
యాతని చెట్టఁబట్టినాను.

సుద—నాయాజ్ఞకా?

కామ—అవును. ఇదిగో మీ యంగీకారపత్రిక. ఇది మీ
స్వహస్తలిఖితము.

సుద—ఏమీ! నన్ను భ్రమపెట్టి నాకొమార్తెను నీ వపహ
రింపఁ దలఁచుకొన్నావా? ఈ యుపాయముచేతనే నీవు భానుమతి
హారణమునుకూడ దక్కించుకొనెంచినావా? అట్లయిన, నిశ్చయ
ముగా వసుకామునివలె నీవును దొంగవే.

కామ—ఓ సుదర్శనవర్మా! నేనట్టివాఁడనుగాను. నీ కొమా
ర్తెను పాణిగ్రహణము చేసికొనుటలో నీ యుత్తరమువలని లాభము
పొందినవాఁడ నయినను మోసముచేసి యీ సొమ్మును పరిగ్రహిం
చుట నేను హేయముగా నెంచెదను. ఇదిగో నీయుత్తరము నీవు
పుచ్చుకొమ్ము (అని యుత్తర మిచ్చి) నీ యాభరణమునకు మాఱుగా
నీకొమార్తెకు నీ దీవనలనిమ్ము. ఇందుకు మాఱుగా నా కున్న సొ